# జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక

సంపుటి : 01 సంచిక : 303, ఎడిటర్: మార్పు సాయి కుమార్ పేజీలు : 08, వెల రూ. 5రూ/ శుక్రవారం -07 - మార్చి - 2025

Published From, Guntur : Circulatedat,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna,Kurnool ,Srikakulam, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad



విలేకరులు కావలెను

ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా నడపబడుతున్న జనం రిపోర్టర్ తెలుగు దినపత్రికలో పనిచేయుటకు

ఆంధ్ర మరియు తెలంగాణ రాష్ట్రాల్లో జిల్లాల వారిగా రిపోర్టర్లు కావలెను.

అంకిత భావంతో పనిచేసేందుకు ఆసక్తి గలవారు

సంప్రదించండి: 9398 15 6948


## రాజీవ్ గాంధీ కేంబ్రిడ్జి యూనివర్సిటీలో ఫెయిల్ అయ్యాడు: మణిశంకర్ అయ్యర్ తీవ్ర వ్యాఖ్యలు



న్యూఢిల్లీ : కాంగ్రెస్ సీనియర్ నేత మణిశంకర్ అయ్యర్ చేసిన వ్యాఖ్యలతో మైలేజి పొందేందుకు బీజేపీ ప్రయ త్నిస్తోంది. ఇంతకీ మణిశంకర్ వ్యాఖ్యలు చేసింది ఎవరిపైనో కాదు... దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీపైనే. సొంత పార్టీకి చెందిన రాజీవ్ పై మణిశంకర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశం అయ్యాయి.

## పీఓకేను ఆక్రమించుకుంటాం... అదే కశ్మీర్ సమస్యకు తుది పరిష్కారం: జైశంకర్



న్యూఢిల్లీ : భారత్, పాకిస్థాన్ మధ్య కశ్మీర్‌పై సుదీర్ఘ కాలంగా వివాదం కొనసాగుతోంది. దక్షిణ ఆసియా దౌత్య సంబంధాలపై ఈ అంశమే ఎక్కువ ప్రభావం చూపుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. అంతర్గత సమస్యలను పరిష్కరించేందుకు భారత్ ఇప్పటికే అనేక చర్యలు చేపట్టింది. కానీ సరిహద్దు విషయంలో మాత్రం వివాదం కొనసాగుతూనే ఉంది.

## సనాతన ధర్మంపై వ్యాఖ్యలు.. ఉదయనిధిపై కొత్త కేసులు నమోదు చేయొద్దన్న సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : డీఎంకే నేత, తమిళనాడు డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్ కు సుప్రీంకోర్టు ఊరట కల్పించింది. సనాతన ధర్మంపై ఆయన చేసిన వ్యాఖ్యలకు గానూ కొత్త కేసులు ఏవీ నమోదు చేయొద్దని సర్వోన్నత న్యాయస్థానం తాజాగా ఆదేశాలు జారీ చేసింది.



# నారా లోకేశ్ చొరవతో ఏర్పాటైన 'మన మిత్ర'లో 200కి చేరిన సేవలు



**వాట్సాప్ గవర్నెన్స్ దిశగా ఏపీ ప్రభుత్వం అడుగులు**

**వర్సిటీల్లో ఖాళీలు వాస్తవమే... ఈ ఏడాదే భర్తీ చేస్తాం: మండలిలో నారా లోకేశ్**

- ఇటీవలే మన మిత్ర పేరిట వాట్సాప్ వేదిక ప్రారంభం
- తొలుత 161 రకాల సేవలతో ప్రారంభం
- ఇప్పుడా సేవల సంఖ్య మరింత పెరిగిన వైనం
- శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు లోకేశ్ సమాధానం
- వర్సిటీల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని వెల్లడి

**3,282 పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరణ**

అమరావతి : పౌరసేవలను మరింత సులభతరంగా ప్రజలకు అందించేందుకు మంత్రి నారా లోకేశ్ చొరవతో ఏర్పాటైన 'మన మిత్ర' దూసుకుపోతోంది. 'మన మిత్ర' పేరిట ఏపీ ప్రభుత్వం ప్రారంభించిన వాట్సాప్ గవర్నెన్స్ విజయవంతంగా ప్రజలకు సేవలందిస్తోంది. ఈ ఏడాది జనవరి 30వ తేదీన మంత్రి లోకేశ్ చేతుల మీదుగా దేశంలోనే తొలిసారిగా 161 రకాల పౌరసేవలను వాట్సాప్ ద్వారా అందించేందుకు ప్రారంభించిన మనమిత్ర... మిగతా..2లో

## త్వరలో బీజేపీకి రిటర్న్ గిఫ్ట్ ఇస్తాం : ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై శ్రీధర్ బాబు



- ఆ పార్టీల మధ్య ఫెవికాల్ బంధం ఉందన్న శ్రీధర్ బాబు
- బీజేపీ, బీఆర్ఎస్ కలయిక వారి పతనానికి తొలి అడుగు అన్న మంత్రి
- బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కై కాంగ్రెస్ పార్టీని ఓడించాయన్న మంత్రి

హైదరాబాద్ : త్వరలో బీజేపీకి రిటర్న్ గిఫ్ట్ ఇస్తామని తెలంగాణ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. తాము బీజేపీకి ఎన్నో రిటర్న్ గిఫ్ట్‌లు ఇచ్చామని, త్వరలో మిగతా..2లో

2లో

## నారా భువనేశ్వరిని, ట్రస్ట్ నిర్వాహకులను అభినందిస్తున్నాను: సీఎం చంద్రబాబు



- విజయవాడలో ఎన్టీఆర్ ట్రస్ట్ సొంత భవన నిర్మాణానికి శంకుస్థాపన
- పాల్గొన్న నారా భువనేశ్వరి, ట్రస్ట్ సిబ్బంది
- ట్వీట్ చేసిన చంద్రబాబు

## ఎమ్మెల్సీ రేసులో విజయశాంతి.. ఢిల్లీలో సడెన్‌గా రాములమ్మ ప్రత్యక్షం..!



న్యూ ఢిల్లీ : : గత కొద్ది రోజులుగా రాజకీ యాలకు దూరంగా ఉంటున్న కాంగ్రెస్ నాయకురాలు విజయశాంతి.. మళ్లీ యాక్టివ్ అయినట్లు తెలుస్తోంది. పార్లమెంట్ ఎన్నికల తరువాత అజ్ఞాతంలో ఉన్న విజయశాంతి.. ఒక్క సారిగా ఢిల్లీలో ప్రత్యక్షమయ్యారు. కాంగ్రెస్ పెద్దలను ఆమె కలుస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేను కలిసినట్లు సమా చారం. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ సీటు కోసం ఆమె ప్రయత్నం మిగతా..2లో

- పార్లమెంట్ ఎన్నికల తరువాత అజ్ఞాతంలో ఉన్న విజయశాంతి..
- ఒక్క సారిగా ఢిల్లీలో ప్రత్యక్షమయ్యారు
- ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ సీటు కోసం ఆమె ప్రయత్నం చేస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది
- ఎమ్మెల్సీ ఎన్నికల వేళ విజయశాంతి ఢిల్లీలో ప్రత్యక్షం కావడం.. కాంగ్రెస్ పెద్దలను కలవడం హాట్ టాపిక్‌గా మారింది

2లో

## తెలంగాణలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం..



- రేవంత్ రెడ్డి గాలి మాటలకు ప్రజలే సమాధానం చెప్పారు: కిషన్ రెడ్డి
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ తిరుగులేని విజయాన్ని సాధించిందన్న కిషన్ రెడ్డి
- పట్టభద్రులు రేవంత్ కు చెంపపెట్టులాంటి తీర్పు ఇచ్చారని వ్యాఖ్య
- ఎన్నికల ఫలితాలు తమ బాధ్యతను మరింత పెంచాయన్న కేంద్ర మంత్రి

## ఎస్సీ వర్గీకరణ ముసాయిదా బిల్లుకు తెలంగాణ కేబినెట్ ఆమోదం




## విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు మంత్రి లోకేష్ కీలక నిర్ణయం.. పలు సంస్కరణలకు రంగం సిద్ధం!

అమరావతి : విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు అందరం కలిసికట్టుగా కృషిచేయాల్సిన అవసరం ఉందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. కళాశాలల్లో విద్యార్థుల ఆత్మహత్యలపై మండలి సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. కళాశాలల్లో విద్యార్థుల ఆత్మహత్యలు ఎవరికైనా బాధాకరం. విద్యాశాఖ మంత్రి అయిన తర్వాత ఎవరైనా విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడితే.. సొంత పిల్లలకు జరిగినట్లుగా భావించి అధికారులు స్పందించాలని చెప్పానని మిగతా..2లో



## క్లీన్ చిట్ వచ్చింది... ఇక దూసుకెళతా: కిరణ్ రాయల్



- ఇటీవల కిరణ్ రాయల్ పై లక్ష్మీరెడ్డి అనే మహిళ సంచలన ఆరోపణలు
- కిరణ్ రాయల్ ను తాత్కాలికంగా పక్కన పెట్టిన జనసేన పార్టీ
- కొన్ని రోజుల కిందట లక్ష్మీరెడ్డి యూటర్న్
- కిరణ్ రాయల్ తో తనకు గొడవలేమీ లేవని వెల్లడి
- సర్దుబాటు జరిగిందని స్పష్టీకరణ

## వాలంటీర్ల పై నిర్ణయం మారేనా - ప్రభుత్వం క్లారిటీ..!!



అమరావతి : ఏపీ ప్రభుత్వం వాలంటీర్లకు సంబంధించి కీలక హామీ ఇచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తరువాత వాలంటీర్లను కొనసాగిస్తామని.. వారికి పది వేలు వేతనం ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు.




## లగచర్ల, హకీంపేట భూసేకరణపై హైకోర్టులో రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఎదురుదెబ్బ

# ఆపరేషన్ తెలంగాణ, కీలక మలుపు - డేంజర్ బెల్స్..!!

**అలర్ట్ కావాల్సింది ఎవరు.. ఏం జరుగుతోంది..**

- ఈ ఎన్నికల తో రాజకీయంగా డేంజర్ బెల్స్ మోగుతున్నాయి.
- అనూహ్య ఫలితాలతో ఒక్క సారిగా బీజేపీలో జోష్ పెరిగింది
- ప్రధాని గెలిచిన ఎమ్మెల్సీలను అభినందించారు
- తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపుగా మారుతున్నాయి
- ముఖ్యమంత్రి రేవంత్ ప్రచారం చేసినా ప్రయోజనం దక్కలేదు




హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. తాజా ఎమ్మెల్సీ ఎన్నిక ల్లో బీజేపీ రెండు స్థానాలు గెలుచుకుంది. కాంగ్రెస్ సిట్టింగ్ సీటు కోల్పోయింది.బీఆర్ఎస్ పోటీకి దూరంగా ఉంది. అనూహ్య ఫలితాలతో ఒక్క సారిగా బీజేపీలో జోష్ పెరిగింది. ప్రధాని గెలిచిన ఎమ్మెల్సీలను అభినందించారు. ఢిల్లీ కేంద్రంగా ఆపరేషన్ తెలంగాణ మొదలైంది. ఈ ఎన్నికల తో రాజకీయంగా డేంజర్ బెల్స్ మోగుతున్నాయి. అలర్ట్ కావాల్సింది ఎవరు.. ఏం జరుగుతోంది..

**మారుతున్న లెక్కలు**

తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపుగా మారుతున్నాయి.

## రాజీవ్ గాంధీ కేంబ్రిడ్జి యూనివర్సిటీలో ఫెయిల్ అయ్యాడు: మణిశంకర్ అయ్యర్ తీవ్ర వ్యాఖ్యలు

మొదటి పేజి తరువాయి

ఇంతకీ ఆయన ఏమన్నారంటే... "రాజీవ్ గాంధీ మొదట్లో ఓ పైలట్. కానీ ఆయన చదువుకునే రోజుల్లో రెండు సార్లు పరీక్షలు తప్పారు. రాజీవ్ తో కలిసి నేను కూడా కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో చదువుకున్నాను. కేంబ్రిడ్జ్ లో ఆయన 'ఫెయిల్' అయ్యారు. విచిత్రమైన విషయం ఏమిటంటే... కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో పాస్ అవడం చాలా తేలిక. ఎందుకంటే, కేంబ్రిడ్జ్ వర్సిటీకి ఎంతో గొప్ప పేరుంది. ఫెయిలైన వాళ్లు ఎక్కువ మంది ఉంటే విద్యాసంస్థకు చెడ్డపేరు వస్తుందని, అక్కడ ప్రతి ఒక్కరినీ పాస్ చేసేందుకు ప్రయత్నిస్తారు. అలాంటి చోట కూడా రాజీవ్ గాంధీ ఫెయిల్ అయ్యారు. ఆ తర్వాత లండన్ లోని ప్రఖ్యాత ఇంపీరియల్ కాలేజీలో చేరారు. అక్కడ కూడా 'ఫెయిల్' అయినట్టే సాకినిస్తుంటుంది... ఇటువంటి వ్యక్తి ఎలా ప్రధానమంత్రి కాగలిగారు?" అంటూ మణిశంకర్ అయ్యర్ వ్యాఖ్యలు చేశారు. ఇదే అదనుగా బీజేపీ నేతలు కాంగ్రెస్ పై విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. దాంతో... కాంగ్రెస్ నేతలు విమర్శలను తిప్పికొట్టే ప్రయత్నం చేశారు. మణిశంకర్ అయ్యర్ నిరాశతో, అసంబద్ధమైన వ్యాఖ్యలు చేస్తున్నాడని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన అధికార ప్రతినిధి ఒకరు స్పందిస్తూ... మణిశంకర్ అయ్యర్ బీజేపీకి 'స్లీపర్ సెల్' గా పనిచేస్తున్నారని ఆరోపించారు.

## పీఓకేను ఆక్రమించుకుంటాం... అదే కశ్మీర్ సమస్యకు తుది పరిష్కారం: జైశంకర్

మొదటి పేజి తరువాయి

దీనిపై విదేశాంగ మంత్రి జైశంకర్ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. కశ్మీర్ వివాదం చాలా వరకు పరిష్కారం అయ్యిందని అన్నారు. యూకే పర్యటనలో ఉన్న ఆయన లండన్‌లో ఓ సమావేశంలో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు.

కశ్మీర్‌లో పురోగతి సాధించాం

కశ్మీర్ వివాదం విషయంలో భారత్ ఇప్పటికే చాలా పురోగతి సాధించిందని జైశంకర్ తెలిపారు. 'జమ్మూకశ్మీర్‌కు స్పెషల్ స్టేటస్ కల్పించిన ఆర్టికల్ 370 రద్దు, ఆర్థిక వృద్ధి, సామాజిక న్యాయాన్ని పునరుద్ధరించే చర్యలు అందుకు దోహదం చేశాయి. ఆర్టికల్ 370 రద్దు తర్వాత కశ్మీర్ ప్రాంతంలో పరిస్థితులు చాలా మారాయి. తాజాగా ఎన్నికలు సజావుగా పూర్తయ్యాయి. ఓటర్లు పెద్ద సంఖ్యలో పోలింగ్ బూత్‌కు తరలి వచ్చారు. అయితే భారత్ నుంచి పాక్ బలవంతంగా ఆక్రమించుకున్న కశ్మీర్‌లోని కొంత భాగాన్ని తిరిగి తెచ్చుకోవాల్సిన అవసరం ఉంది. అది జరిగి తీరుతుంది. అప్పుడే కశ్మీర్ సమస్యకు తుది పరిష్కారం లభించినట్టు అవుతుంది.' అని అన్నారు.

చైనాతో సంబంధాలు

ఈ సందర్భంగా చైనాతో సంక్లిష్టంగా మారిన భారత సంబంధాలపై జైశంకర్ మాట్లాడుతూ, 'పొరుగు దేశంతో మంచి రిలేషన్‌షిప్‌ను కోరుకుంటున్నాం. ఇరు దేశాలకూ ప్రయోజనం చేకూర్చే వాతావరణం నెలకొనాల్సిన అవసరం ఉంది. ఆ సమయంలో ఒకరి సెంటిమెంట్లను ఒకరు గుర్తించి, గౌరవించాలి. అప్పుడే ఇరువురికీ ప్రయోజనం ఉంటుంది. చైనాతో బైలేటరల్ కోఆపరేషన్ కోసం దశాబ్దాలుగా శాంతి, సామరస్యపూర్వక వాతావరణానికి భారత్ ప్రాధాన్యం ఇచ్చింది. అయినప్పటికీ 'లైన్ ఆఫ్ యాక్చువల్ కంట్రోల్' వద్ద చైనా అనుసరించిన వైఖరి వల్ల ఘర్షణలు తలెత్తాయి.' అని పేర్కొన్నారు. పరోక్షంగా 2020లో జరిగిన గల్వాన్ ఘర్షణను ప్రస్తావించారు. సరిహద్దులో ఇలాంటి వాతావరణం ఉంటే సహజంగానే అది ఇరు దేశాల సంబంధాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని స్పష్టం చేశారు. ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ.. చైనాతో సంబంధాలను మెరుగుపర్చుకోవడం కోసం భారత్ ప్రయత్నాలు చేస్తోందని జైశంకర్ తెలిపారు. ఈ విషయంలో ఇప్పటి వరకు చాలా పురోగతి సాధించామన్నారు. లైన్ ఆఫ్ యాక్చువల్ కంట్రోల్ వద్ద బలగాలను వెనక్కి తీసుకోవడం అందులో భాగమేనన్నారు. కైలాస పర్వత సందర్శనకు భక్తులకు అనుమతి, ఇరు దేశాల మధ్య నేరుగా విమానాల రాకపోకలు, జర్నలిస్టులు సహా పలు అంశాలపై ప్రస్తుతం చర్చలు జరుగుతున్నట్లు జైశంకర్ వెల్లడించారు. ఇరు దేశాల్లో ప్రవహిస్తున్న నదుల నిర్వహణపై కూడా చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య పలుసార్లు చర్చలు కూడా జరిగాయి. మరోవైపు సైనిక, దౌత్య అధికారులు సైతం అనేక సార్లు ఉన్నతస్థాయి సమావేశాలు నిర్వహించారు. ఫలితంగా ఇరు దేశాల మధ్య సంబంధాలు తిరిగి క్రమంగా గాడిన పడుతున్నాయి.

యూకే పర్యటనలో జైశంకర్

జైశంకర్ ప్రస్తుతం యూకే పర్యటనలో ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలతో దౌత్య సంబంధాలను మెరుగు పర్చుకోవాలి అనే లక్ష్యంలో భాగంగా ఆయన ఈ పర్యటన చేపట్టారు. మార్చి 4 నుంచి 9 మధ్య బ్రిటన్, ఐర్లా ండ్‌లో పర్యటిస్తున్నారు. బైలేటరల్ రిలేషన్స్‌ను మెరుగుపర్చడమే ప్రధాన లక్ష్యం. డిఫెన్స్, ట్రేడ్, హెల్త్, ఎడ్యుకేషన్ సహా అనేక రంగాల్లో భారత్-యూకే మధ్య సుదీర్ఘకాలంగా సత్సంబంధాలు కొనసాగుతున్నాయి. భారత వ్యూహాత్మక, ఆర్థిక ప్రయోజనాలను సాకారం చేసుకునే దిశగా జైశంకర్ పర్యటన ఓ ముందడుగు కానుంది.

## సనాతన ధర్మంపై వ్యాఖ్యలు.. ఉదయనిధిపై కొత్త కేసులు నమోదు చేయొద్దన్న సుప్రీంకోర్టు

మొదటి పేజి తరువాయి

కాగా, 'సనాతన ధర్మం' పై ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. ఆయన వ్యాఖ్యలపై హిందూ సంఘాలు, పలువురు తీవ్రంగా తప్పుపట్టారు. ఇక ఆయన వ్యాఖ్యలపై దేశావ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో అనేక ఎఫ్ఐఆర్‌లు కూడా నమోదయ్యాయి. తాజాగా బీహార్‌లో ఇదే అంశంపై మరో కేసు నమోదైంది. దీంతో ఉదయనిధి స్టాలిన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వివిధ రాష్ట్రాల్లో తనపై నమోదైన బహుళ ఎఫ్ఐఆర్‌లను ఏకీకృతం చేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. సనాతన ధర్మం అంశంలో కోర్టు అనుమతి లేకుండా ఉదయనిధి స్టాలిన్‌పై కొత్త కేసులు ఏవీ నమోదు చేయొద్దని ఆదేశించింది. 2023లో చెన్నైలో జరిగిన ఓ కార్యక్రమంలో ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ.. "సనాతన ధర్మం' డెంగీ, మలేరియా లాంటిది. దాన్ని నిర్మూలించాలి' అంటూ వ్యాఖ్యానించారు. దీంతో స్టాలిన్ వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేగాయి. ఈ వ్యాఖ్యలపై పలువురు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అయితే, ఉదయనిధి మాత్రం తన వ్యాఖ్యలకు కట్టుబడే ఉన్నానని.. ఈ విషయంలో క్షమాపణలు చెప్పేదే లేదని తెగేసి చెప్పారు.

## త్వరలో బీజేపీకి రిటర్న్ గిఫ్టు ఇస్తాం : ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై శ్రీధర్ బాబు

మొదటి పేజి తరువాయి

మరొకటి ఇస్తామని ఆయన అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ గెలుపు నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కై కాంగ్రెస్ పార్టీని ఓడించాయని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య ఫెవికాల్ బంధం ఉందని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో అది మరోసారి వెల్లడైందని ఆయన అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ కలవడమనేది వారి పతనానికి తొలి అడుగు అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీని గెలిపించుకోవడానికి బీఆర్ఎస్ బాగా శ్రమించిందని విమర్శించారు. బీజేపీ, బీఆర్ఎస్ కలిసి తమకు ఎమ్మెల్సీ ఎన్నికల రూపంలో రంజాన్ గిఫ్టు ఇచ్చిందని భావిస్తే, త్వరలో తామూ ఇస్తామని వ్యాఖ్యానించారు. గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ మద్దతిచ్చిన రవీందర్ సింగ్‌కు వచ్చిన ఓట్లు ఆయనకు వ్యక్తిగతంగా వచ్చినవే అన్నారు.

రెండు పార్టీలు కలిసి ఓడించాయి: పొన్నం ప్రభాకర్

బీజేపీ, బీఆర్ఎస్ కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ఓడించాయని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. అభ్యర్థిని పెట్టకుండా బీఆర్ఎస్... బీజేపీతో కుమ్మక్కైందని మండిపడ్డారు. కేటీఆర్, హరీశ్ రావు నియోజకవర్గాల్లో జరిగిన ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వారు ఎవరికి ఓటేశారో చెప్పాలని నిలదీశారు. ఈ ఓటమిని తాము సమీక్షించుకుంటామని అన్నారు.

## నారా భువనేశ్వరిని, ట్రస్ట్ నిర్వాహకులను అభినందిస్తున్నాను: సీఎం చంద్రబాబు



అమరావతి : నారా భువనేశ్వరి నేతృత్వంలోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ విజయవాడ కేంద్రంగా తన సేవలను మరింత విస్తరించనుంది. ఈ క్రమంలో నేడు విజయవాడలో ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ట్రస్ట్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడానికి ఇది మరో మైలురాయి అని నారా భువనేశ్వరి అభివర్ణించారు. దీనిపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. పేదలకు, అభాగ్యులకు సాయం అందించే మహోన్నత లక్ష్యంతో పనిచేస్తున్న ఎన్టీఆర్ ట్రస్ట్ నేడు విజయవాడలో సొంత భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసుకున్న వేళ నారా భువనేశ్వరిని, ట్రస్ట్ నిర్వాహకులను అభినందిస్తున్నానని తెలిపారు. "28 ఏళ్ల కిందట స్థాపించిన ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ కోట్లాది మందిని విపత్కర పరిస్థితుల్లో ఆదుకుంది. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు బాధితులను ఆదుకోవడమే కాకుండా, బ్లడ్ బ్యాంక్ ద్వారా ఎన్నో ప్రాణాలను నిలబెడుతున్న ఎన్టీఆర్ ట్రస్ట్... సేవా కార్యక్రమాలు చేసేవారికి స్ఫూర్తినిస్తోంది. తలసేమియా బాధిత పిల్లలను కంటికి రెప్పలా చూసుకుంటున్న ఎన్టీఆర్ ట్రస్ట్ తన సేవలను విస్తరించే క్రమంలో జరిగిన నేటి నూతన భవన శంకుస్థాపన సందర్భంగా ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజ్ మెంట్ కు, సిబ్బందికి, దాతలకు అభినందనలు తెలుపుకుంటున్నాను" అని చంద్రబాబు తన ట్వీట్ లో పేర్కొన్నారు.

# నారా లోకేశ్ చొరవతో ఏర్పాటైన 'మన మిత్ర'లో 200కి చేరిన సేవలు

మొదటి పేజి తరువాయి



కేవలం 50 రోజుల్లోనే 200 సేవలు అందించే అద్భుతమైన మైలురాయిని అందుకుంది. ఆంధ్రప్రదేశ్‌లో డిజిటల్ గవర్నెన్స్ శక్తికి ఇదో నిదర్శనంగా చెప్పొచ్చు. గత ఏడాది అక్టోబర్ 22న ఢిల్లీలో మంత్రి లోకేశ్ మెటా ప్రతినిధులతో ఏపీ ప్రభుత్వం తరపున ఒప్పందం చేసుకున్నారు. ఇటీవల టెన్త్, ఇంటర్ విద్యార్థులు తమ హాల్ టిక్కెట్లను సైతం వాట్సాప్ ద్వారా పొందగలిగారు. ప్రజలు వివిధ రకాల పౌరసేవల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా చేసేందుకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మన మిత్ర నెం. 9552300009 కు వాట్సాప్ సందేశం పంపడం ద్వారా ప్రస్తుతం 200 రకాల పౌర సేవలను ఏపీ ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. అందులో విద్య, దేవాదాయ, విద్యుత్, ఆర్టీసీ, రెవెన్యూ, అన్న క్యాంటీన్, సీఎంఆర్ఎఫ్, మున్సిపల్ శాఖల సేవలు కూడా ఉన్నాయి. విద్యుత్తు బిల్లులు, పన్నుల చెల్లింపుల వంటి సేవలతో పాటుగా దేవాలయాల్లో దర్శనాలు, వసతి గదుల బుకింగ్, విరాళాల సమర్పణకు ఇది ఉపయోగపడుతోంది.

అలాగే పర్యాటక ప్రదేశాల సమాచారం, టికెట్ బుకింగ్ వంటివి ఈ వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఈజీగా చేసుకోవచ్చు. రెవెన్యూ శాఖకు సంబంధించిన భూ రికార్డులు, ఆదాయ ధ్రువీకరణ వంటి సర్టిఫికెట్లు కూడా సులభంగా పొందొచ్చు. అధునాతన సాంకేతికత వినియోగం ద్వారా ప్రజలకు పౌరసేవలను ఇంటిముంగిటికే తీసుకెళ్లడం విప్లవాత్మకమైన పరిణామం. విశ్వవిద్యాలయాలను బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. సాంకేతిక విశ్వవిద్యాలయాల్లో విద్యార్థుల సంఖ్య, ఉద్యోగుల వివరాలు, ఖాళీల భర్తీ, యూనివర్సిటీల అభివృద్ధిపై మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. యూనివర్సిటీల్లో ఖాళీలు ఉన్నమాట వాస్తవమేనని తెలిపారు. ఈ ఏడాది ఖాళీలన్నీ భర్తీ చేయాలని నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. వన్ మ్యాన్ కమిషన్ రిపోర్ట్ వచ్చిన వెంటనే ఆ ప్రక్రియ కూడా ప్రారంభిస్తామని వెల్లడించారు. "ప్రొఫెసర్స్ ఆఫ్ ప్రాక్టీస్ విషయానికి వస్తే పరిశ్రమ నిపుణులతో ప్రాక్టీషనర్స్ పాఠాలు చెబితే బాగుంటుందని భావిస్తున్నాం. అక్రిడేషన్, క్వాలిటీ అస్యూరెన్స్ కూడా చాలా అవసరం. అది కూడా తీసుకువస్తున్నాం. ఫ్యాకల్టీ డెవలప్ మెంట్ ప్రోగ్రామ్, కెపాసిటీ బిల్డింగ్, వారికి కావాల్సిన ఇంటర్నేషనల్ ఎక్స్ పోజర్ విజిట్ వంటివన్నీ ఏర్పాటుచేయాలని నిర్ణయించాం. డిజిటల్, ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ మెంట్ చేస్తాం. బడ్జెట్ లో కూడా ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను బలోపేతం చేసేందుకు రూ. 2వేల కోట్లు కేటాయించడం జరిగింది. మౌలికవసతులు, పరిశోధనల కోసం ఆ నిధులను ఖర్చుపెడతాం. కేంద్ర కూడా అనేక కార్యక్రమాల కింద విశ్వవిద్యాలయాలకు నిధులు కేటాయిస్తోంది. వాటిని జతపరచి కార్యక్రమాలు చేపడతాం. విశ్వవిద్యాలయాల్లో నియామకాల అంశం కూడా కోర్టులో ఉంది. దీనిపై ఏజీతో మాట్లాడి చర్యలు తీసుకుంటాం. విశ్వవిద్యాలయాల్లో 4,330 శాంక్షన్ పోస్టులు ఉంటే కేవలం 1,048 పోస్టులు భర్తీ చేశారు. 3,282 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని భర్తీ చేస్తాం. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాకింగ్స్ లో ఏపీ 9వ స్థానంలో ఉంది. 3 వ స్థానానికి తీసుకురావాలనేది లక్ష్యం. క్యూఎస్ ర్యాంకింగ్ లో టాప్-100లో ఒక ప్రభుత్వ విశ్వవిద్యాలయం ఉండాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం" అని అన్నారు.

## ఎస్సీ వర్గీకరణ ముసాయిదా బిల్లుకు తెలంగాణ కేబినెట్ ఆమోదం

హైదరాబాద్ : : ఎస్సీ వర్గీకరణ ముసాయిదా బిల్లుకు తెలంగాణ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ముసాయిదాకు తుది మెరుగులు దిద్దాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. న్యాయపరమైన చిక్కులు లేకుండా చూడాలని ఆదేశించారు. ముఖ్యంగా న్యాయ నిపుణుల సలహాలు తీసుకోవాలని చెప్పారు. ఇదిలా ఉండగా.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయం లో కేబినెట్ భేటీ కొనసాగుతోంది. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం అయింది. ఇందులో ఇప్పటికే ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలపగా.. బీసీలకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లను పెంచే బిల్లులకు కేబినెట్ ఆమోదం తెలపనుంది. అంతేకాదు.. రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యే తేదీ, బడ్జెట్ ప్రవేశపెట్టే తేదీలను సైతం ఈ సమావేశంలోనే ఖరారు చేయనున్నారు. టూరిజం పాలసీకి గ్రీన్ సిగ్నల్ ఇవ్వనున్నారు. వీటితో పాటు పలు అంశాలకు ఆమోదముద్ర వేయనున్నారు.

## తెలంగాణలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం..

హైదరాబాద్ : తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ తిరుగులేని విజయాన్ని సాధించిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. పట్టభద్రులు సీఎం రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టులాంటి తీర్పు ఇచ్చారని చెప్పారు. రాష్ట్ర ప్రజలు బీజేపీ వైపు ఉన్నారనే విషయం ఈ ఎన్నికల ఫలితాలతో రుజువయిందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ఘన విజయం సాధించి రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఖమ్మం-నల్గొండ-వరంగల్ టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలో ఓటమిపై సమీక్షించుకుంటామని కిషన్ రెడ్డి తెలిపారు. అక్కడ కూడా బలోపేతం అవుతామని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో రేవంత్ రెడ్డి తనను టార్గెట్ చేశారని... ఆయన తనపై చేసిన వ్యక్తిగత విమర్శలపై తాను స్పందించనని అన్నారు. విధానపరమైన అంశాలపైనే తాను స్పందిస్తానని చెప్పారు. ప్రజలు ఇచ్చిన ఈ తీర్పు తమపై బాధ్యతను మరింత పెంచిందని తెలిపారు. గ్రాడ్యుయేట్లు, టీచర్లు తమపై నమ్మకం ఉంచి, గెలిపించడం సంతోషంగా ఉందని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి తనపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. రేవంత్ రెడ్డి గాలి మాటలకు సంజాయిషీ ఇవ్వాల్సిన అవసరం తనకు లేదన్నారు. ఆయన చేసిన ఆరోపణలకు ఎన్నికల్లో ప్రజలే సరైన తీర్పు ఇచ్చారని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించి కాంగ్రెస్ కు చెంపపెట్టులాంటి జవాబిచ్చారని కిషన్ రెడ్డి అన్నారు. ప్రజాతీర్పును గౌరవించి ఇకనైనా ఎన్నికల హామీల అమలుపై దృష్టి పెట్టాలంటూ రేవంత్ రెడ్డికి హితవు పలికారు. ఈమేరకు హైదరాబాద్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రైతులకు ఎకరాకు రూ. 15 వేలు, నిరుద్యోగ భృతి, మహిళలకు నెలనెలా రూ. 2,500, దళితులకు రూ. 12 లక్షలు, ఆడపిల్లలకు స్కూటీలు ఇస్తామంటూ కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గుర్తుచేశారు. ఈ హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా జీవో 317 కారణంగా ఇబ్బందులు పడుతున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కోరారు.

## ఎమ్మెల్సీ రేసులో విజయశాంతి.. ఢిల్లీలో సడెన్‌గా రాములమ్మ ప్రత్యక్షం..!

మొదటి పేజి తరువాయి

చేస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. గత కొన్నాళ్లుగా రాములమ్మ సైలెంట్‌గా ఉండడంతో ఆమె పార్టీ మారుతున్నారని ప్రచారం కూడా జరిగింది. మళ్లీ బీజేపీలో చేరే అవకాశం ఉందన రూమర్లు పుట్టించారు. అయితే సడెన్‌గా ఎమ్మెల్సీ ఎన్నికల వేళ విజయశాంతి ఢిల్లీలో ప్రత్యక్షం కావడం.. కాంగ్రెస్ పెద్దలను కలవడం హాట్ టాపిక్‌గా మారింది. సీఎం రేవంత్‌రెడ్డిని కలవకుండానే నేరుగా కాంగ్రెస్ హై కమాండ్ నేతలతోనే రాములమ్మ భేటీ కావడంపై రాజకీయంగా చర్చ జరుగుతోంది. లోక్‌సభ ఎన్నికల తరువాత విజయశాంతి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. రాష్ట్రంలో పార్టీ అధికారంలో ఉన్నా.. ఆమె మాత్రం సైలెంట్‌గా ఉంటున్నారు. అప్పుడప్పుడు సోషల్ మీడియా వేదికగా తన అభిప్రాయం చెబుతున్నారే తప్పా.. ఎక్కడా కనిపించలేదు. ఇప్పుడు సోషల్ మీడియాలో కూడా యాక్టివ్‌గా లేరు. ఎన్నికల సమయంలో విజయశాంతి సేవలను వినియోగించుకున్న నేతలు.. ఆ తరువాత పట్టించుకోవడం మానేశారని ప్రచారం కూడా ఉంది. ఈ నేపథ్యంలో విజయశాంతి మళ్లీ బీజేపీ వైపు చూస్తున్నారని రూమర్లు వచ్చాయి. ఆమె పార్టీ మార్పు ప్రచారం జరుగుతున్నా.. కాంగ్రెస్ నేతలు మాత్రం ఒక్కరు కూడా స్పందించలేదు. రాములమ్మ వద్దకు వెళ్లి.. పార్టీలోనే కొనసాగాలని కోరలేదు. దీంతో విజయశాంతి మరింత ఆగ్రహానికి గురైనట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంఛార్జిగా మీనాక్షి నటరాజన్ రాకతో పరిస్థితిలో మార్పులు వచ్చినట్లు తెలుస్తోంది. గాంధీభవన్‌లో విజయశాంతి గురించి ఆమె ఆరా తీసినట్లు సమాచారం. ఎన్నికల సమయంలో యాక్టివ్‌గా ఉన్న విజయశాంతి ఇప్పుడు ఎందుకు సైలెంట్‌గా ఉన్నారు..? ఇప్పుడు ఏం చేస్తున్నారు..? వంటి వివరాలు తెలుసుకున్నట్లు చెబుతున్నారు. సీనియర్ నేతల సేవలను పార్టీ సరిగా వినియోగించుకోవడం లేదని ఫీడ్‌బ్యాక్ చరావడంతో మీనాక్షి నటరాజన్ కఠిన నిర్ణయాలకు సిద్ధమయ్యారు. పార్టీ లైన్ దాటిన నేతలకు వార్నింగ్ ఇస్తూ తీన్మార్ మల్లన్నపై వేటు వేయగా.. ఇప్పుడు సీనియర్ నేతలకు కీలక బాధ్యతలు అప్పగించి వారి సేవలు పార్టీకి ఉపయోగించుకోవాలని మీనాక్షి నటరాజన్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఇన్నాళ్లు మౌనంగా ఉన్న రాములమ్మ.. ఢిల్లీలో హైకమాండ్ పెద్దలతో భేటీ కావడం చర్చనీయాంశంగా మారింది. మీనాక్షి నటరాజన్ సపోర్ట్‌తోనే ఆమె ఢిల్లీలో పెద్దలను కలిశారా..? హైకమాండ్ రాములమ్మను ఎమ్మెల్సీ చేయనుందా..? అనే విషయాలు త్వరలో తేలిపోనున్నాయి.

## విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు మంత్రి లోకేష్ కీలక నిర్ణయం.. పలు సంస్కరణలకు రంగం సిద్ధం!

మొదటి పేజి తరువాయి

మంత్రి లోకేష్ అన్నారు. విద్యార్థుల ఆత్మహత్యలకు ఒక ప్యాట్రన్ అంటూ ఏమీ లేదని 2016లో 6 గురు చనిపోతే.. 2019లో నలుగురు చనిపోయారన్నారు. 2021లో ఏడుగురు చనిపోయారు. 2022లో 12 మంది, 2023లో 17మంది, 2024లో ఆరుగురు చనిపోయారు. విద్యార్థుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయనే ప్యాట్రన్ లేదు. అయితే ఆత్మహత్యలు జరుగుతున్నాయి. ఇవన్నీ ఇంటర్ విద్యలోనే చోటుచేసుకున్నాయి. టెక్నికల్ ఎడ్యుకేషన్ విషయానికి వస్తే.. ఒకేడాది ఒకరిద్దరు చనిపోతే, మరో ఏడాది 11 మంది, మరో ఏడాది ఒకరు చనిపోయారు. దీనికి ప్యాట్రన్ లేదు. యూనివర్సిటీల్లో కూడా ఆత్మహత్యలు జరిగాయి. 2014 నుంచి 18 మంది చనిపోయారు.

విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు స్కూల్ వెల్ నెస్ టీమ్స్ ఏర్పాటు

స్కూల్ వెల్ నెస్ టీమ్స్ ఏర్పాటుచేసి ప్రైవేటు, ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు ఓరియంటేషన్ ఇచ్చి ఎర్లీయర్ సింప్టమ్స్ ను క్యాచ్ చేయాల్సిన అవసరం ఉంది. కేవలం జూనియర్ కాలేజీల నుంచి విశ్వవిద్యాలయాల వరకే కాకుండా పాఠశాల విద్యలో కూడా లైంగిక వేధింపుల ఆరోపణలు వస్తున్నాయి. స్కూల్ ఎడ్యుకేషన్‌లో కూడా సుమారు 280 మంది కౌన్సిలర్స్ ను నియమించామని అన్నారు. వారు ఉపాధ్యాయులకు కూడా శిక్షణ ఇచ్చి ఎర్లీ సింప్టమ్స్ ను పిల్లల ప్రవర్తనలో మార్పును గమనించి, సరిచేయడంతో పాటు ప్రాపర్ కౌన్సిలింగ్ చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. ఆత్మహత్యల నివారణకు అమెరికాకు చెందిన క్యూపీఆర్ ఇన్ స్టిట్యూట్ వారు బెంగళూరులో ఓ పార్ట్నర్‌తో ఒప్పందం చేసుకున్నామని, స్కూల్ కౌన్సిలర్ ట్రైనింగ్ కోసం గైడెన్స్, ఇంటర్వెన్షన్, క్రైసిస్ సపోర్ట్ మేనేజ్‌మెంట్ కు వారితో సంప్రదిస్తున్నామన్నారు. అలాగే ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం టెలీ కౌన్సిలింగ్ సర్వీస్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పిల్లల్లో ఒత్తిడి, ఆందోళన తగ్గించేందుకు కౌన్సిలింగ్ నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల విషయానికి వస్తే.. మెంటర్ మెంటీ సిస్టమ్ కూడా తీసుకురావడం జరిగింది. ఎన్ సీసీ, రెడ్ క్రాస్ ను కూడా పాఠశాల విద్యలో తీసుకురావాల్సిన అవసరం ఉంది. ఎన్ సీసీ డైరెక్టరేట్ ఇవ్వాలని కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్ గారిని కూడా కోరడం జరిగింది. రెప్యుటెడ్ ఎన్జీవోస్ తో ఒప్పందం కుదుర్చుకుని ఆత్మహత్యలు నివారించాలని, పిల్లల్లో ఎర్లీ సింప్టమ్స్ ను గుర్తించాలని మా అధికారులకు కూడా చెప్పడం జరిగింది. తల్లిదండ్రులు కూడా ఫీజు కట్టాం కాబట్టి అన్ని సబ్జెక్ట్‌ల్లో మార్కులు రావాలని ఒత్తిడి పెడుతున్నారు. ఒత్తిడి తగ్గించేందుకు కూడా ఆలోచన చేస్తున్నాం. ఇంటర్మీడియట్ బోర్డులో సంస్కరణలు తీసుకువచ్చాం. కొత్త అవకాశాలు కల్పిస్తున్నాం. కరిక్యులమ్ రీవ్యాంప్ చేస్తున్నాం. తల్లిదండ్రుల నుంచి ఫీడ్ బ్యాక్ కూడా తీసుకుంటున్నాం. ఆత్మహత్యలు చోటుచేసుకోవడం చాలా తీవ్రమైన అంశం. తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు కౌన్సిలింగ్ ఉండాలి. ప్రైవేటు, గవర్నమెంట్ ఇద్దరికీ కౌన్సిలింగ్ ఉండాలి. ప్రైవేటు యాజమాన్యంపై కూడా బాధ్యత ఉంది. విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు ఏం చర్యలు తీసుకుంటున్నారని వాకబు చేస్తున్నామని అన్నారు. హ్యూమిలియేషన్ తట్టుకోలేక కూడా పిల్లలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఆత్మహత్యల నివారణకు అందరం కలిసికట్టుగా కృషిచేయాలన్నారు. అలాగే పాఠశాలల్లో యాక్టివ్ ఏపీ ప్రాజెక్ట్ కింద వచ్చే ఏడాది నుంచి వారానికి 150 నిమిషాలు ఫిజికల్ యాక్టివిటీ ఏర్పాటుచేస్తామని, స్కూల్స్ గ్రౌండ్స్ అన్నీ మ్యాప్ చేసి మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. చక్రపాణి నివేదికపై అధ్యయనం చేయాల్సి ఉందన్నారు.

## వాలంటీర్ల పై నిర్ణయం మారేనా - ప్రభుత్వం క్లారిటీ..!!

మొదటి పేజి తరువాయి

అయితే, గత ప్రభుత్వంలోనే వాలంటీర్లను రెన్యువల్ చేస్తూ నాడు నిర్ణయం తీసుకోలేదని..అమల్లో లేని వాలంటీర్లను తాము ఎలా కొనసాగిస్తామని ప్రభుత్వం ప్రశ్ని స్తోంది. ఇక, ఇప్పుడు వాలంటీర్ల కొనసాగింపు గురించి ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది.

వాలంటీర్ల పై చర్చ :- ఏపీలో వాలంటీర్ల వ్యవహారం మరోసారి చర్చకు వచ్చింది. మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి ఈ అంశం పైన స్పష్టత ఇచ్చారు. వాలంటీర్ల వ్యవస్థ పైన ఇప్పటికే పలుమార్లు క్లారిటీ ఇచ్చిన అంశాన్ని గుర్తు చేసారు. వైసీపీ ప్రభుత్వ హయాంలోనే 2023 ఆగస్టు నుంచే వాలంటీర్ల వ్యవస్థ రెన్యువల్ చేయలేదని.. మనుగడలో లేదని స్పష్టం చేసారు. విధుల్లో లేని వాలంటీర్లతో నాటి ప్రభుత్వం పనులు చేయించుకుందని మండిపడ్డారు. వారితో ఎన్నికల సమయంలో రాజీ నామాలు చేయించిందని ఆగ్రహం వ్యక్తం చేసారు.

ప్రభుత్వం క్లారిటీ :- వాలంటీర్ల రెన్యువల్ పైన నిర్ణయం తీసుకోని వైసీపీ ప్రభుత్వం నాడు వాలంటీర్లను.. ప్రజలను మోసం చేసిందని మంత్రి ఆరోపించారు. గతంలో శాసన మండలిలో చర్చ సమయంలో వైసీపీ నేత బొత్సా వాలంటీర్ల జీవో ఇచ్చి ఉండకపోతే.. రెన్యువల్ జీవో ఇవ్వచ్చు కదా అంటూ నిలదీ సారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వాలంటీర్లను కొనసాగించి వారికి రూ 10 వేలు చొప్పున చెల్లించాలని డిమాండ్ చేసారు. అయితే, అసలు మనుగడలో లేని వ్యవస్థ కు జీతాలు ఏ విధంగా చెల్లిస్తారని మంత్రి ప్రశ్నించారు. గతంలో పవన్ వద్దకు సర్పంచ్ ల సంఘ నేతలు వచ్చి వాలంటీర్ల అంశం ప్రస్తావన చేసిన సమయంలో కీలక వ్యాఖ్యలు చేసారు.

ఇక లేనట్లేనా :-వాలంటీర్లు వ్యవస్థలోనే లేరని పవన్ అప్పట్లో వ్యాఖ్యానించారు. ఇదో సాంకేతిక సమస్య అంటూ తేల్చి చెప్పారు. కూటమి ప్రభుత్వం ప్రస్తుతం సచివాలయ ఉద్యోగులతోనే పెన్షన్ పంపిణీ ప్రతీ నెలా కొనసాగిస్తోంది. వాలంటీర్లను తిరిగి విధుల్లోకి తీసుకునే అవకాశాలు కనిపించటం లేదు. ఇదే సమయంలో వాలంటీర్లు మాత్రం నిరసనలు కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం పైన ఒత్తిడి పెంచే ప్రయత్నం చేస్తున్నారు. ఇక, ఇటీవలే ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు కొంత విడుదల చేశామని చెప్పారు. గత ప్రభుత్వం తాలూకా పెండింగ్ కూడా విడుదల చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

## క్లీన్ చిట్ వచ్చింది... ఇక దూసుకెళతా: కిరణ్ రాయల్

అమరావతి : తిరుపతి జనసేన ఇన్చార్జిగా ఉన్న కిరణ్ రాయల్ ను... పార్టీ హైకమాండ్ తాత్కాలికంగా పక్కన పెట్టిన సంగతి తెలిసిందే. లక్ష్మీ రెడ్డి అనే మహిళ... కిరణ్ రాయల్ తనను మోసం చేశాడని, రూ. 1.20 కోట్లు ఎగ్గొట్టాడని ప్రెస్ మీట్ పెట్టడంతో జనసేన పార్టీ విచారణకు ఆదేశించింది. అయితే, లక్ష్మీరెడ్డి కొన్నిరోజుల కిందట మళ్లీ మీడియా ముందుకు వచ్చి... కిరణ్ రాయల్ తో తనకు గొడవలేమీ లేవని, అన్నీ సర్దుబాటు అయ్యాయని యూటర్న్ తీసుకుంది. తన ఇబ్బందులను కొందరు రాజకీయాల కోసం వాడుకున్నారని ఆమె వాపోయింది. ఇక, తనపై వచ్చిన ఆరోపణలు వీగిపోవడంతో కిరణ్ రాయల్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తిరుపతి ప్రెస్ క్లబ్ లో మీడియా ముందుకు వచ్చిన ఆయన... తనకు క్లీన్ చిట్ వచ్చిందని, ఇక నేషనల్ హైవేపై దూసుకెళ్లినట్టు దూసుకెళతా అని ఆనందంగా చెప్పారు. ఇప్పటివరకు జరిగిన పరిణామాలన్నీ తన మంచికే జరిగాయని భావిస్తానని అన్నారు. ఎవరు ఎలాంటి వారో తెలిసిందన్నారు. తనకు, లక్ష్మీ రెడ్డికి మధ్య ఆర్థిక లావాదేవీలు మాత్రమే ఉన్నాయని, ఆమెను అడ్డంపెట్టుకుని తనను తొక్కేయాలని ప్రయత్నించారని కిరణ్ రాయల్ ఆరోపించారు. ఆమెకు ఆర్థికంగా ఆశచూపారని, ఆమె కొడుకులను కూడా బెదిరించారని వివరించారు. అయితే, ఈ వ్యవహారంలో తాను ఏ తప్పు చేయలేదని కొందరు నమ్మారని, తనకు అది చాలని అన్నారు. జీవితంలో ఇద్దరికి రుణపడి ఉంటానని... ఒకరు పవన్ కల్యాణ్, రెండు మీడియా అని వెల్లడించారు. నేను ఎలాంటి తప్పుడు పని చేయలేదని తెలిసే పవన్ కల్యాణ్ విచారణ జరపమన్నారు అని కిరణ్ రాయల్ చెప్పుకొచ్చారు. ఇక, తనపై కుట్ర చేసిన వాళ్లెవరన్నది ఆధారాలతో సహా పవన్ ముందుంచుతానని తెలిపారు.

## లగచర్ల, హకీంపేట భూసేకరణపై హైకోర్టులో రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఎదురుదెబ్బ

హైదరాబాద్ : లగచర్ల, హకీంపేటలో భూసేకరణపై రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. లగచర్ల, హకీంపేటలో భూసేకరణ చేయవద్దంటూ హైకోర్టు స్టే విధించింది. భూసేకరణను ఆపేయాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. లగచర్లలో ఫార్మా కంపెనీ ఏర్పాటు నిమిత్తం భూసేకరణ కోసం ప్రభుత్వం నోటిఫికేషన్‌ను జారీ చేసింది. లగచర్లలో ఫార్మా కంపెనీ ఏర్పాటును స్థానిక రైతులు వ్యతిరేకించారు. భూసేకరణపై రైతుల అభిప్రాయం తీసుకునేందుకు కలెక్టర్ లగచర్లకు వెళ్లిన సమయంలో దాడి కూడా జరిగింది. కలెక్టర్ మీద దాడికి సంబంధించి అరెస్టులు కూడా జరిగాయి. ఈ నేపథ్యంలో లగచర్లలో ఫార్మా కంపెనీలను ఏర్పాటు చేయకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లను విచారించిన న్యాయస్థానం స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. నోటిఫికేషన్‌ను రద్దు చేసింది. తదుపరి విచారణను వాయిదా వేసింది. హకీంపేట భూసేకరణ నోటిఫికేషన్‌ను శివకుమార్ అనే వ్యక్తి హైకోర్టులో సవాల్ చేశారు. భూసేకరణ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని కోరారు. నోటిఫికేషన్‌ను రద్దు చేసేంత వరకు స్టే విధించాలని కోరారు. ప్రభుత్వం గత ఏడాది నవంబర్ 29న భూసేకరణపై నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఇక్కడ ఇండస్ట్రియల్ పార్కు కోసం 351 ఎకరాల భూసేకరణకు నోటిఫికేషన్ ఇచ్చింది. అయితే, 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించడం లేదంటూ పిటిషనర్ కోర్టుకు తెలిపారు.

## ఆపరేషన్ తెలంగాణ, కీలక మలుపు - డేంజర్ బెల్స్..!!

మొదటి పేజి తరువాయి

సాధారణంగా అధికారంలో ఉన్న పార్టీకి అనుకూలంగా ఫలితాలు ఉంటాయి. ఇక్కడ మాత్రం ఫలితాలు భిన్నంగా వచ్చాయి. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఎన్నికలకు దూరంగా ఉంది. బీజేపీ అనూహ్యంగా రెండు స్థానాలు గెలుచుకుంది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ సిట్టింగ్ సీటును బీజేపీ కైవసం చేసుకుంది. కాంగ్రెస్ ప్రతిష్ఠాత్మకంగా భావించిన కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో బీజేపీ విజయం సాధించింది. బీజేపీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి రెండో ప్రాధాన్యఓట్లతో విజయం సాధించారు.

కాంగ్రెస్ కు షాక్ :- ఇదే జిల్లాలకు చెందిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాన్నీ గెలుచుకున్న బీజేపీ.. పట్టభద్రుల ఎమ్ మెల్సీని కూడా దక్కించుకోవడం ద్వారా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో మరోసారి పట్టు నిరూపించు కుంది. కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో సిటింగ్ ఎమ్మెల్సీగా కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నేత జీవన్‌రెడ్డి ఉన్నారు. ఈసారి పోటీకి ఆయన సుముఖత తెలపకపోవడంతో కాంగ్రెస్ అధిష్ఠానం అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డిని బరిలోకి దింపింది. ఈ నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో 21 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు ఉన్నా, మిత్రపక్షంగా సీపీఐ మద్దతు ప్రకటించినా కాంగ్రెస్ తన సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకో లేకపోయింది.

బీజేపీ గురి :- ముఖ్యమంత్రి రేవంత్ ప్రచారం చేసినా ప్రయోజనం దక్కలేదు. దుఇదే నియోజకవర్గ రిధిలో ఏడు గురు ఎమ్మెల్యేలు, నలుగురు ఎంపీలను కలిగి ఉన్న బీజేపీ అందరికంటే ముందుగానే అభ్యర్థిని ప్రకటించినా ఆలస్యంగా ప్రచారంలోకి దిగింది. అయినా అనూహ్యంగా పోటీ ఇచ్చి పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంతోపాటు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాన్ని కూడా కైవసం చేసుకొని ఈ ప్రాంతంలో పట్టును మరింత పెంచుకుంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా బీజేపీ కొత్త స్కెచ్ అమలు చేస్తోంది. కాంగ్రెస్ అంతర్గత పరిణామాలు తమకు మేలు చేస్తాయని బీఆర్ఎస్ ఆశలు పెట్టుకుంది. ఇదే సమయంలో బీజేపీ పుంజుకోవటం కాంగ్రెస్ తో పాటుగా బీఆర్ఎస్ కు డేంజర్ బెల్స్ గా మారుతున్నాయి. దీంతో.. రానున్న రోజుల్లో రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకునే అవకాశం కనిపిస్తోంది.

## డివిజన్ ఎల్లాపూర్ లో గల సర్వే నంబర్ 246 మరియు316 గల భూ అక్రమలపై చర్యలు తీసుకోవాలి



హసన్ పర్తి మండలం ( జనం రిపోర్టర్ ) : హసన్ పర్తి మండల పరిధిలోని 65వ డివిజన్ ఎల్లాపూర్ లో భూ అక్రమాలపై చర్యలు తీసుకోవాలని ఈరోజు హనుమకొండలోని ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవోకు వినతి పత్రాన్ని అందజేయడం జరిగింది ఎల్లాపూర్ గ్రామంలోని భూమి యొక్క సర్వే నెంబర్ 316లో గల అంగడి భూమిని 4ఎకరాల 15 గుంటలో చదనం చేసి ప్రైవేట్ సర్వేరుతో అంగడి భూమిలో ప్లాట్లు చేయుచుండగా విషయాన్ని వర్ధన్నపేట నియోజకవర్గం ఎమ్మెల్యే కె.ఆర్ నాగ రాజు పోలీస్ డిపార్ట్మెంట్ ద్వారా ఎన్నోసార్లు ఆపించగలిగారు అదే సమయంలో ఇందిరమ్మ ఇండ్ల కొరకు ప్రభుత్వ కార్యాలయాలకు ఇట్టి భూములు కాపాడాలని అధికారులతో పాటు ప్రజలకు ఈ స్థలాలను కాపాడాలని తెలియజేశారు మరియు సర్వేనెంబర్ 246 లో గల 12 ఎకరాల 13 గుంటల భూమి ( చేపల ఉత్పత్తి కేంద్రంలో గల కలగిరి బంగళ మరియు గోదాం వీటికి సంబంధించిన హౌస్ లు భూ అక్రమ దారులైన.పహానిలలో గ్రామపంచాయతీ చేపల వ్యాపారం అని రికార్డుల్లో ఉండగా పహాని సంబంధించిన శిలాఫలకాన్ని ఎలాంటి దస్తావేజులు లేకుండా ఉన్నటువంటి భూ కబ్జాదారులు ఈ భవనాలనుకూల్చివేసి నేలమట్టం చేసిన రు గ్రామ ప్రజలు ఇంత పెద్ద భవనాలను కూల్చిన వీరిపై వీరిని ప్రోత్సహించిన వారిపై కూడా కేసు నమోదు చేయాలి ప్రజలు ముక్తకంఠంతో విన్నవిస్తున్నారు.అదే సమయంలో మున్సిపల్ అధికారులు కలెక్టర్ ఈ భూములు కబ్జా కాకుండా చూడాలని ఆయా శాఖలకు తెలియజేసిన అధికారుల ఉత్తరువు లేఖలను పట్టించుకోకుండా నాలా పర్మిషన్ ఎలా ఇచ్చారనేదే ప్రశ్న కాగా ఇట్టి పర్మిషన్ను వెంటనే రద్దు చేసి అట్టి ప్రభుత్వ స్థలాలకు ప్రభుత్వ స్థలంగా బోర్డులు ఏర్పాటు చేయాలని 1973 వ సంవత్సరంలో సి సుబ్రహ్మణ్యం కేంద్ర మంత్రివర్యులుగా ఉన్నటువంటి ఇట్టి చేపల కేంద్రాన్ని ప్రారంభించారు. ఇట్టి విషయాలను చాలాసార్లుఅధికారులకు వినతి పత్రాలు ఇవ్వడం జరిగింది అయినా పట్టించుకోని అధికారులు అక్రమార్కులపై ఎలాంటి చర్యలు లేవు అని హనుమకొండ జిల్లా ఆర్డీవో రాథోడ్ రమేష్.కు ఇట్టి విషయాలపై ఎమ్మెల్యే నాగరాజు కూడా విషయాన్ని తెలియజేశామని ఆర్డీవో కు వివరించడం జరిగింది వారిపై చర్యలు తీసుకోవాలని. ప్రభుత్వ భూములను రక్షించాలి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మోత లింగారెడ్డి, నేదునూరి సునీల్, రేణుకుంట్ల దుర్గాప్రసాద్ మాదిగ,దోమల శ్రీనివాస్, ఎర్ర నాగరాజు, భాషబోయిన కుమార్ యాదవ్, గోపన బోయిన రవీందర్, వాల్మీకి, ఎండి షేక్. బాబ్, వెలిసాజు బుచ్చి రాములు,మధ్యల తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలపై అమరచింతలో బిజెపి నాయకుల సంబరాలు



అమరచింత వనపర్తి జిల్లా ప్రతినిధి ( జనం రిపోర్టర్ ) : ఉపాధ్యాయ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థుల విజయం పట్ల గురువారం అమరచింత పట్టణంలోని బిజెపి జండా కట్ట వద్ద నాయకులు కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాజీ పట్టణ అధ్యక్షులు క్యామ భాస్కర్ మాట్లాడుతూ



రాష్ట్రంలో బిజెపి గాలి వీస్తుందని చెప్పడానికి ఈ ఎమ్మెల్సీ ఎన్నికలే నిదర్శనమని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఏకమైన పట్టబద్రులు, ఉపాధ్యాయులు అభ్యర్థులకే విజయాన్ని అందించారని అన్నారు. అనంతరం బిజెపి జండా కట్ట వద్ద ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. బిజెపి అభ్యర్థులు విజయదుంపిది మోగించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ బాణాసంచా కాల్చారు. ఈ కార్యక్రమంలో దుబాయి వెంకటేశ్వర్ రెడ్డి, అనిల్ కుమార్, రాకేష్ శెట్టి, వాటర్ శ్రీనివాస్ యాదవ్, కొంగరి కృష్ణమూర్తి, సాకలి రవి, భరత్, నరసింహ, వంశీ, మాల విష్ణు పాల్గొన్నారు.

## బాపట్ల పట్టణాన్ని ప్లాస్టిక్ రహిత బాపట్లగా తీర్చిదిద్దుకుందాం

**బాపట్ల 1500 కిలోల ప్లాస్టిక్ ను స్వాధీనం చేసుకున్నా కమిషనర్**

**వ్యాపారస్తులు ఇకనుండి ప్లాస్టిక్ ను వినియోగిస్తే సహించేది లేదు**

**పర్యావరణానికి హాని తలపెట్టే ప్లాస్టిక్ ను అందరం స్వచ్ఛందంగా నిషేధించాలి**

**చట్టపరమైన చర్యలకు వెనుకాడబోము సింగిల్ యూస్ ప్లాస్టిక్ ను నిషేధించండి పర్యావరణాన్ని కాపాడండి**



బాపట్ల జిల్లా : ( జనం రిపోర్టర్ ) : బాపట్ల పురపాలక సంఘ పరిధిలోని ప్లాస్టిక్ ను అధికంగా విక్రయించే దుకాణాలపై , వ్యాపార సముదాయాలపై ఈరోజు సాయంత్రం మునిసిపల్ కమిషనర్ జి.రఘునాథ రెడ్డి స్వయంగా సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గడియార స్తంభం వద్ద గల హోల్ సేల్ దుకాణాల నందు ఆకస్మిక దాడులు నిర్వహించి అత్యధికంగా సుమారు 1500 కిలోల ప్లాస్టిక్ ను స్వాధీనం చేసుకున్నారు.కమిషనర్ మాట్లాడుతూ పట్టణ పరిధిలోని వ్యాపారస్తులు ఇకనుండి ప్లాస్టిక్ ను వినియోగిస్తే సహించేది లేదని అన్నారు. పర్యావరణానికి హాని తలపెట్టే ప్లాస్టిక్ ను అందరం స్వచ్ఛందంగా నిషేధించాలని అన్నారు. దీనికి వ్యాపారస్తులు అందరూ సహకరించి బాపట్ల పట్టణాన్ని ప్లాస్టిక్ రహిత బాపట్లగా తీర్చిదిద్దుకుందామని, అలాగుననే పట్టణ ప్రజలు కూడాను ప్లాస్టిక్ మరియు సింగిల్ యూస్ ప్లాస్టిక్ ను వాడడం మానేసి గుడ్డ సంచులను ఉపయోగించాలని చెప్పారు. ఇకపై ప్లాస్టిక్ ను



మరో మారు వినియోగిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తే తనిఖీలు నిర్వహించి చట్టపరమైన చర్యలకు వెనుకాడబోమని కమిషనర్ దుకాణదారు లకు తెలిపారు. ఈ తనిఖీల నందు శానిటరీ ఇన్స్పెక్టర్లు సి.హెచ్.కరుణ డి.శ్రీనివాసరావు,పురపాలక సంఘ సిబ్బంది,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సింగరేణి మారుపేర్ల విజిలెన్స్ పెండింగ్ కేసుల సమస్య పరిష్కారం లేక ప్రాణాలు పోతున్న పట్టించుకోరా.....?

సింగరేణి మారుపేర్ల విజిలెన్స్ పెండింగ్ కేసుల బాద్యులు....



రామగుండం ( జనం రిపోర్టర్ ) : రామగుండం:మార్చ్ 06. సింగరేణి మారుపేర్ల విజిలెన్స్ పెండింగ్ కేసుల సమస్య పరిష్కారం లేక ప్రాణాలు పోతున్న పట్టించుకోని సింగరేణి, ఉద్యోగం రాక న్యాయం కోసం తిరుగుతున్న క్రమంలో సింగరేణి మారుపేర్ల విజిలెన్స్ పెండింగ్ కేసుల బాధితుడు ఆదినారాయణ కి యాక్సిడెంట్లో కాలు విరగడం చాలా బాధాకరమైన విషయం. దయచేసి ఇప్పటికే రెండు ప్రాణాలు పోయాయి.



ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరుతున్నాము. వెనకట కార్మికులకు చదువు లేక ఎన్నో సంవత్సరాల క్రితం జరిగిన తప్పుకి మమ్మల్ని శిక్షించకండి. వెంటనే మాకు ఉద్యోగ అవకాశం కల్పించి మాకు న్యాయం చేస్తారని కోరుకుంటున్నాం అని బాధను తమ ఆవేదన వ్యక్తం చేశారు.

## "ఇన్ఫోసిస్" నియామకాలలో వివిఐటి విద్యార్థినుల సత్తా



పెదకాకాని ( జనం రిపోర్టర్ ) : ప్రముఖ ఐటి సేవల దిగ్గజ సంస్థ ఇన్ఫోసిస్ నియామకాల కొరకు ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీతో కలసి ఇంజనీరింగ్ విదార్థినులకు నిర్వహించిన ప్రాంగణ ఎంపిక నందు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలకు చెందిన 88మంది బాలికలు ఉత్తమ ప్రతిభ కనబరచి ఉద్యోగ నియామకాలు పొందారని కళాశాల ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. గ్రామీణ నేపధ్యం గల బాలికలు అధికంగా ఈ నియామకాలు పొందడం సంతోషం కలిగించిందని తెలిపారు. కృష్ణ గుంటూరు ప్రాంతీయ పరిధిలో వివిఐటి విద్యార్థులు అధిక నియామకాలు పొందటం విశేషం అని అన్నారు. నియామకాలు పొందిన విద్యార్థినులు 3.6 లక్షల నండి 9.5 లక్షల వార్షిక వేతనం సంస్థ కేటాయించినట్లు తెలిపారు. కళాశాలలోని ప్రతి విద్యార్థిని పరిగణలోనికి తీసుకుని ఉద్యోగ నియామకాలు పొందేవిధంగా తొలి ఏడాది నుండే పరిశ్రమ అవసరాలకు తగట్టు అత్యాధునిక సాంకేతిక అంశాలలో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని తెలిపారు.అనంతరం నియమకాలు పొందిన విద్యార్థులను ప్రిన్సిపల్ డా? వై. మల్లిఖార్జునరెడ్డి, డీన్ అకడమిక్ డాఎఎ కె.గిరిబాబు, డీన్ ప్లేస్మెంట్ డా? ఎమ్. వి.రఘురామ్, ఉపాధికల్పనా మరియు శిక్షణా విభాగాధిపతి డాఎఎ" యూ.మాధవ్, అధ్యాపకులు అభినందించారు.

## సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ ఉత్పత్తులను మరింతగా పెంచాలి కలెక్టర్ జె వెంకట మురళి



బాపట్ల జిల్లా :- ( జనం రిపోర్టర్ ) : సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ ఉత్పత్తులను మరింతగా పెంచాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. సేంద్రియ వ్యవసాయం వార్షిక ప్రణాళికపై అనుబంధ శాఖల అధికారులతో గురువారం స్థానిక కలెక్టరేట్ లో ఆయన సమావేశం నిర్వహించారు. రసాయన ఎరువులు, పురుగుమందులు వినియోగం లేకుండా పంటలు సాగు చేయాలని కలెక్టర్ అన్నారు. సంప్రదాయ పద్ధతిలో వ్యవసాయం సాగు చేస్తేనే ప్రజల ఆరోగ్యాన్ని సంరక్షించగలమన్నారు. హరిత విప్లవం ద్వారా ఆహార ధాన్యాల కొరతను పూర్తిగా అధిగమించడం సంతోషదాయకమన్నారు. తదనంతరం ఎరువులు, పురుగు మందులు వాడకం పెరగడం, నూతన వంగడాలతో ఉత్పత్తుల దిగబడి పెంచినప్పటికీ ప్రజల ఆరోగ్యానికి భద్రత లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ వాడకం, రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగంతో క్యాన్సర్ వంటి రోగాలకు ప్రజలు గురవుతున్నారని వివరించారు. ప్రజారోగ్యాన్ని పరిరక్షించాలంటే సంప్రదాయ వ్యవసాయానికి అనుకూలంగా రైతులు నడుంబిగించాల్సి ఉందని స్పష్టం చేశారు. రైతులే స్వయంగా విత్తనాలు సిద్ధం చేసుకోవాలన్నారు. అలాగే జీవామృతం వంటి సేంద్రియ ఎరువులను తయారు చేసుకుని వినియోగించుకోవాలన్నారు. 2025వ సంవత్సరంలో ఒక లక్ష 7 వేల 165 ఎకరాలలో సేంద్రియ పద్ధతిలోనే పంటలు సాగు చేయాలని వార్షిక ప్రణాళిక రూపొందించినట్లు ప్రకటించారు. 62 వేల 97 మంది రైతులను సేంద్రియ వ్యవసాయ పద్ధతిలోకి తెచ్చేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం కొరకు సమన్వయంతో అధికారులు పనిచేయాలని ఆయన మార్గనిర్దేశం చేశారు. సేంద్రియ వ్యవసాయంపై గ్రామాలలో విస్తృతమైన అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ వెంకట మురళి తెలిపారు. ఇప్పటికే కొన్ని పంటలను సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్నట్లు వివరించారు. ఈ సంవత్సరంలో వరి, శనగ, మినుము, పెసర, జొన్న, మొక్కజొన్న, కూరగాయలు, పండ్ల తోటల సాగు విస్తృతంగా వ్యాప్తి చేయాలని ఆదేశించారు. స్వయం సహాయక సంఘాలలోని మహిళా రైతులందరికీ చైతన్య కార్యక్రమాలతో అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని 362 గ్రామ సంఘాలలో సమావేశాలు నిర్వహించి, మహిళ రైతులతో చర్చించాలన్నారు. సిఎన్ఎఫ్ కింద పనిచేస్తున్న 385 మంది ఐసీపిఆర్, యూనిట్ ఇన్చార్జిలు, మాస్టర్ ట్రైనర్లను క్షేత్రస్థాయిలోకి పంపాలన్నారు.



రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకం పూర్తిగా తగ్గించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వాటి వల్ల కలిగే నష్టాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సేంద్రియ వ్యవసాయంపై కలిగే ప్రయోజనాలను వివరించాలన్నారు. ఈనెల 30వ తేదీలోగా ఖరీఫ్ వంటల సాగుపై గ్రామస్థాయిలో సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు. జిల్లా స్థాయిలో నిర్దేశించిన లక్ష్యాలు చేరుకునేలా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. సేంద్రియ ఉత్పత్తులను పెంచడమే లక్ష్యంతో అధికారులు ముందుకు సాగాలన్నారు. ఇందుకోసం డి ఆర్ డి ఏ అధికారులు సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రైతులకు అవసరమైన రుణ సదుపాయం కల్పించాలన్నారు. డ్వామా ద్వారా వ్యవసాయ కూలీలను చైతన్య పరచాలన్నారు. ఉద్యాన పంటల వైపు రైతులు మొగ్గు చూపేలా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పంటలు సాగు సమయంలోనూ, ఎరువుల తయారీ, వినియోగంపై అవగాహన కల్పించడం, దిగుబడి సమయంలో రైతులకు తగిన సూచనలు ఇవ్వాల్సి ఉందన్నారు. పంట చేతికి వచ్చిన తదుపరి రైతులకు మంచి ధర లభించేలా మార్కెట్ సౌకర్యం కల్పించాలని, ఇ-మార్కెటింగ్ విధానంపై అవగాహన కల్పించాలన్నారు. సంబంధిత వ్యక్తులతో రైతులను అనుసంధానించాలన్నారు. అనుబంధ శాఖలంతా సమన్వయంతో పనిచేస్తేనే మంచి ఫలితాలు వస్తాయని వివరించారు.ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ జిల్లా అధికారి రామకృష్ణ సేంద్రియ వ్యవసాయం ఏపీ సీఎన్ఎఫ్ డిపిఎం వాణిశ్రీ, అదనపు మోహన్ కుమార్, ఉద్యాన శాఖ ఏడి జెన్నమ్మ, డ్వామా పిడి విజయలక్ష్మి, డిఆర్డిఏ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరిగింది. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి, ఐపీఎస్



వికారాబాద్ జిల్లా ప్రతినిధి: ( జనం రిపోర్టర్ ) : ఈ రోజు వికారాబాద్ పట్టణం లోని పలు పరీక్షా కేంద్రాలను స్వయంగా సందర్శించి భద్రతా చర్యలను సమీక్షించారు.

## ఎస్సీ ఎస్టీ జర్నలిస్ట్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ వెంకట్ మురళి జర్నలిట్టుల సమస్యల పరిష్కారానికి కృషి



రేపల్లె ( జనం రిపోర్టర్ ) : దళిత జర్నలిస్టుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎస్సీ,ఎస్టీ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కొత్తపల్లి రమేష్ అన్నారు. బాపట్ల జిల్లా ఎస్సీ ఎస్టీ జర్నలిస్టు అసోసియేషన్ నూతన కార్యవర్గంతో జిల్లా కలెక్టర్ జే వేంకట మురళీని గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ పత్రిక రంగంలో పనిచేస్తున్న ఎస్సీ ఎస్టీ జర్నలిస్ట్ లకు వృత్తిపరంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కార దిశగా నూతన కార్యవర్గ సభ్యులు పని చేయాలన్నారు. జర్నలిస్టులను ఐక్య పరచి అసోసియేషన్ బలోపేతానికి కృషి చెయ్యాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ జే వేంకట మురళీ చేతుల మీదుగా క్యాలెండర్ ను ఆవిష్కరించారు. బాపట్ల జిల్లా ఎస్సీ ఎస్టీ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులుగా గుమ్మడి సూర్యప్రకాష్ ఎంపికవ్వగా ,ప్రధాన కార్యదర్శిగా గూడూరు రమేష్ బాబు, గౌరవ అధ్యక్షులుగా బొడ్డు మణి వరకుమార్ ఉపాధ్యక్షులుగా కర్ర జయరావు, సహాయ కార్యదర్శిగా గుడిమొటి అశోక్ కుమార్, గౌరవ ఉపాధ్యక్షులుగా జీవి ప్రసాద్ ఎంపికయ్యారు.

## నెలల నిండకుండా పుట్టిన కవలలకు ఆర్థిక సహాయం



రాజవొమ్మంగి మార్చి 6 జనం రిపోర్టర్:అల్లూరి జిల్లా రంపచోడవరం నియోజకవర్గం రాజవొమ్మంగి మండల కేంద్రంలో గిలాథ్ మెడికల్ షాపు లక్ష్మణ్ స్నేహితుడు అర్తమూరు గ్రామానికి చెందిన ప్రాథమిక వైద్యులు కాకర శ్రీనివాసు తమ స్నేహితులకు ఇచ్చిన సమాచారం మేరకు హెల్పింగ్ హేండ్స్ ఫర్ పూర్ అనే నినాదంతో బాధిత తల్లిదండ్రులకు 28 వేల రూపాయలు అందజేసారు.ఈ సందర్భంగా ప్రాథమిక వైద్యులు శ్రీనివాసు మాట్లాడుతూ మండపేట మండలం అర్తమూరు గ్రామానికి చెందిన తుమ్మలపల్లి సీతారామయ్య,విజయలక్ష్మి దంపతులకు 7వ నెలలోనే కవలపిల్లలు పుట్టడంతో శిశువులు ఎదుగుదల సరిగా లేదని పిల్లలను(ఇంకుబాటర్) బాక్స్ లో 1 నెల పాటు పెట్టాలని రోజువారీ ఖర్చు చాలా పెద్ద మొత్తంలో అవుతుందని డాక్టర్లు దంపతులకు చెప్పడంతో వారు కన్నీరుమున్నీరై రోజువారీ కూలి పని చేసుకొని రోజులు వెళ్ళబుచ్చుకుంటున్న వారు ఏవిధమైన దారీ లేక పిల్లల ఆరోగ్యం కాపాడుకొను నిమిత్తం ఆర్థికంగా సహాయ పడమని సామాజిక మాధ్యమాల్లో విషయాన్ని తెలుపగా అది చూసి మా మిత్రులకు సామాజిక మాధ్యమాల్లో తెలియజేయాగా వెంటనే స్పందించి మా స్నేహితులమందరం కలసి 28వేల రూపాయలు సొమ్మును వారికి అందజేయడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమానికి సహకరించిన స్నేహితులు రాజవొమ్మంగి గ్రామానికి చెందినలక్ష్మణ్ గిలాథ్ మెడికల్ షాపు,ఏలేశ్వరం గ్రామానికి చెందిన శ్రీనివాసు శ్రీను స్వీట్స్, రమేష్ రుచి కేటరింగ్,కిరణ్ కుమార్ సీనియర్ అసిస్టెంట్ ఎంపీడీఓ ఆఫీస్,బాబ్జీ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్,రాజు హోటల్ శ్రీలేఖ,పాపారావు శరణ్య జనరల్ స్టోర్,లక్ష్మీనారాయణ రియల్ ఎస్టేట్,శ్రీను తాపీ మేస్త్రి,లంక రాజు ప్రయివేటు పాఠశాల కరస్పాండెంట్,కోటపాటి కళ్యాణ్ కృష్ణ ఫైనాన్స్ కంపెనీ,రాజమండ్రి కి చెందిన మోహన తదితరులు ఉన్నారు

## అభ్యంతరం లేని అక్రమిత భూముల క్రమబద్దీకరణ గ్రామకంఠం భూములకు కూడా విముక్తి 22ఎ నుండి ప్రయివేట్ భూముల తొలగింపు రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్



రేపల్లె ( జనం రిపోర్టర్ ) : నిరుపేదలకు, భూ యజమానులకు న్యాయం చెయ్యాలనే లక్ష్యంతో 22 ఏ నిషేధిత భూముల జాబితా నుండి ప్రయివేట్ భూములను తొలగించాని నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. అసెంబ్లీ సమావేశాలు గురువారం ఆయన మాట్లాడుతూ ప్రజలకు న్యాయం చేయాలని లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందన్నారు. నిషేధ ఆస్తుల జాబితా నుండి ప్రయివేట్ భూములను ఎలా తొలగించాలనేది స్పష్టంగా మెమోలో తెలిపామని చెప్పారు. ఈమేరకు అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. పంచాయతీలలో ఉన్న గ్రామ కంఠాల్లో ఉండే ప్రయివేట్ వ్యక్తుల ఆస్తులను కూడా నిషేధ జాబితా నుండి తొలగించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. దీనికి సంబంధించి 2015లోనే అప్పటి కూటమి ప్రభుత్వం 187 జీవోను ఇచ్చిందని గుర్తు చేశారు. పంచాయతీలకు చెందిన సామాజిక ఆస్తులు మినహా మిగిలిన ఆస్తులను నిషేధ జాబితా నుండి తొలగిస్తూ ఆ జీవో ఇచ్చారని చెప్పారు. అయితే గత ప్రభుత్వం రీ సర్వే చేసిన సందర్భంలో రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో 4,157 ఎకరాలను నిషేధ జాబితాలో పెట్టారని, దీని వల్ల సామాన్యులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామ కంఠంలోని ప్రయివేట్ ఆస్తులను పరిశీలించి నిషేధ జాబితా నుండి తొలగించాలని నిర్ణయించినట్లు చెప్పారు. కాగా రాష్ట్ర వ్యాప్తంగా అభ్యంతరం లేని ప్రభత్వ భూములను ఆక్రమించుకొని ఇల్లు కట్టుకున్న వారికి క్రమబద్ధీకరణ చేస్తున్నామని చెప్పారు. వీరికి ఏడాదిపాటు సమయం ఇచ్చామని, వీరంతా ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు. గత ప్రభుత్వం భూముల రీ సర్వేను ఫార్సుగా మార్చిందని, సరిహద్దు రాళ్లపై, పాస్ పుస్తకాలపైన బొమ్మలు వేసుకోవాలనే కాంక్షతో రీ సర్వేను తప్పుల తడకగా మార్చిందని విమర్శించారు. కానీ తమ ప్రభుత్వం భూ యజమానులకు న్యాయం చేయాలనే లక్ష్యంతో సమగ్రంగా రీసర్వే చేయిస్తున్నామని మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు.

## స్వలాభం కోసం కార్మికులను ఉసికొలుపుతున్న ఒక నాయకుడు....

### ఎమ్మెల్యే మీద కార్మికులకు పూర్తి విశ్వాసం ఉంది... ఆర్.ఎఫ్.సి.ఎల్ కాంట్రాక్టు కార్మిక సంఘం అధ్యక్షుడు నెలకంటి రాము....



రామగుండం ( జనం రిపోర్టర్ ) : రామగుండం:మార్చ్ 06. ఒక యూనియన్ నాయకుడిచ్చిన టోకెన్ సమ్మె పిలుపును ఆర్.ఎఫ్.సి.ఎల్ కార్మికులు వ్యతిరేకిస్తూ, సమ్మెలో కార్మికులు ఎవరు పాల్గొనడం లేదని,రామగుండం శాసనసభ్యులు ఆర్ ఎఫ్ ఎల్ కాంట్రాక్టు కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ ఆర్.ఎఫ్.సీ.ఎల్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని గతంలోనే హామీ ఇచ్చారని,వారి పట్ల పూర్తి విశ్వాసం ఉందని,ఆర్.ఎఫ్.సి.ఎల్ కార్మికులందరికీ టోకెన్ సమ్మెకు పిలుపునిచ్చిన నాయకుడు మా కార్మికుల పేరు చెప్పి మమ్మల్ని దోచుకున్నాడని, ఇదే కార్మిక నాయకుడు, ఇదే కాంట్రాక్టర్ల వద్ద నెల నెల జీతం తీసుకున్న వ్యక్తి, గతంలో ఉన్నటువంటి ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌వద్ద కార్మిక సమస్యలు పరిష్కరిస్తానని మమ్మల్ని అడ్డం పెట్టుకొని లక్షలాది రూపాయలు దోచుకున్నాడని,ఈరోజు కార్మికులంతా శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ మక్కాన్సింగ్ వెంట ఉన్నామని, అంబటి నరేష్ అనే వ్యక్తి యొక్క స్వలాభం కోసం, కార్మికుల మధ్యన ఉనికిని చాటుకోవడం కోసం, ప్రతిపక్షాలతో కుమ్మక్కై ఆడుతున్న నాటకాలు కార్మికులందరికి తెలుసని, ఇప్పటికే ఈ నాయకుడిని నమ్ముకొని కార్మికులంతా మోసపోయారని, అలాంటి వ్యక్తి ఇచ్చినటువంటి టోకెన్ సమ్మెను ఇక్కడి కార్మికులు ఎవరు కూడా పట్టించుకోవడం లేదని, పరిగణలోకి కూడా తీసుకోవడం లేదని, కార్మికుల పక్షాన కార్మిక సమస్యలపైన అవగాహన ఉన్నటువంటి రామగుండం శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ మక్కాన్సింగ్ పై పూర్తి విశ్వాసంతో ఆర్ ఎఫ్ సి ఎల్ కార్మికులంతా ఉన్నారని ఆర్.ఎఫ్.సి.ఎల్ కాంట్రాక్టు కార్మిక సంఘం అధ్యక్షుడు నెలకంటి రాము తెలిపారు.

## పవన్ అంటే పవర్.. ఓటమి పాఠాలు నేర్వని జగన్..

### 151 నుండి 11 సీట్లకు పడిపోయిన ఘనత జగన్ దే జగన్ పై కొత్తపల్లి ఫైర్



మొగల్తూరు ( జనం రిపోర్టర్ ) : జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అంటే పవర్ అనే విషయం మాజీ ముఖ్యమంత్రి జగన్ కు తెలియకపోవడం సోచనీయమని రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు విమర్శించారు. గురువారం రాత్రి మొగల్తూరు లో జరిగిన విలేకరుల సమావేశంలో జగన్ పై కొత్తపల్లి ఫైర్ అయ్యారు. 151 సీట్ల నుండి 11 సీట్లు పడిపోయిన ఘనత, దానికి కారణం జగనే అనే విషయం ప్రజలందరికీ తెలిసిందేనని అన్నారు. పవన్ కళ్యాణ్ పై జగన్మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కొత్తపల్లి ఖండించారు.గతంలో 151 సీట్లతో ముఖ్యమంత్రి అయిన జగన్ గతేడాది జరిగిన ఎన్నికల్లో 11 సీట్లకు రావడంతో ఇరిటేషన్లో ఉన్నారని వ్యాఖ్యానించారు. జగన్ ఎంత బాధలో ఉన్నప్పటికీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను కార్పొరేటర్ కి ఎక్కువ, ఎమ్మెల్యే కి తక్కువ అని సంబోధించడం సరికాదన్నారు.కూటమి ఏర్పడటానికి, జగన్ 11 సీట్లకు పడిపోవడానికి పవన్ కళ్యాణ్ కారణం అనే విషయం జగన్ తెలుసుకోవాలని సూచించారు. నాగబాబు ప్రజారాజ్యం పార్టీ నుండి కూడా పార్టీని నమ్ముకునే ఉన్నారని ఆయనకు ఎమ్మెల్సీ ఇచ్చి గౌరవించడం సముచితమని అన్నారు.కూటమి ప్రభుత్వం పట్ల ప్రజలకు ఆదరణ ఉంది కాబట్టే ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీని గెలుచుకున్నామని స్పష్టం చేశారు సుబ్బారాయుడు. ఈనెల 14వ తేదీన పిఠాపురంలో జరిగే జనసేన ఆవిర్భావ దినోత్సవ సభను భారీ ఎత్తున విజయవంతం చేయడానికి పార్టీ శ్రేణులు శ్రమించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కర్రి వీరస్వామి, దొంగ స్వామి, సాధనాల చిన్ని, ముక్కు పుల్లయ్య నాయుడు, బర్రె ఏడుకొండలు, దూసనపూడి. కోటి, కొప్పర్తి రమేష్, దేశం శెట్టి.శ్రీను, కొల్లాటి. వీరస్వామి, బర్రె.రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## : విద్యార్థులకు ఇబ్బంది కలుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి:-

### చేవెళ్ల ఎమ్మెల్యే "కాలే యాదయ్య, మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాథోడ్ గీత సింగ్..!!



వికారాబాద్ జిల్లా ప్రతినిధి: నవాబుపేట్ ( జనం రిపోర్టర్ ) : వికారాబాద్ జిల్లా, నవాబ్ పేట్ మండల కేంద్రంలోని ( కేజీబీవీ ) కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్నిసందర్శించిన చేవెళ్ల స్థానిక శాసనసభ్యులు కాలే యాదయ్యఅనంతరం పాఠశాల విద్యార్థులు మరియు ఉపాధ్యాయులతో మాట్లాడి ఎలుకలు కరిచిన విషయం పై ఆరా తీశారు. అదేవిధంగా విద్యార్థులను పరామర్శించి, ప్రస్తుతం ఆరోగ్యం ఎలా ఉందని, పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉన్నాయని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో మండల మార్కెట్ కమిటీ చైర్మన్ రాథోడ్ గీతా సింగ్, పిఏసిఎస్ చైర్మన్ పోలీస్ రామిరెడ్డి, వైస్ చైర్మన్ పోలీస్ బలవంత రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ ప్రశాంత్ గౌడ్, మార్కెట్ డైరెక్టర్లు, కందాడ నరసింహారెడ్డి, మహమ్మద్ ఖదీర్, చిట్టెపు రాజశేఖర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, మండల సీనియర్ నాయకుడు మాలీష్ మల్ రెడ్డి సీనియర్ నాయకుడు కందాడ నాగిరెడ్డి, ప్రభుత్వ అధికారులు, బి కే వి బి పాఠశాల ఎస్ఓ అశ్విని ప్రజాప్రతినిధులు, మాజీప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా జిల్లా పరిషత్ హైస్కూల్లో ఫేర్వెల్



రాజవొమ్మంగి(జనం రిపోర్టర్) :అల్లూరి జిల్లా రంపచోడవరం నియోజకవర్గం రాజవొమ్మంగి మండల కేంద్రంలో స్థానిక అల్లూరి సీతారామరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10 వ తరగతి విద్యార్థులకు క్రింది తరగతుల విద్యార్థులు వీడ్కోలు వేడుకను గురువారం పాఠశాల ఉపాధ్యాయులు, విద్య కమిటీ ఛైర్మెన్ మరిచర్ల శ్రీనివాస్ అధ్యక్షతన ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని విద్యార్థులతోపాటు కమిటీ సభ్యులు,తదితరులకు మధ్యాహ్నం విందు ఏర్పాటు చేసారు,ఈ ఫేర్వెల్ వేడుకలు ఉపాధ్యాయులు,విద్యాకమిటీ సభ్యుల సమక్షంలో ఘనంగా సాగాయి ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సీహెచ్ శివ కృష్ణ, వెంకటరమణ,భవానీ,యేసుకుమారి,జయలక్ష్మి లు మాట్లాడుతూ ఈ పాఠశాల నుంచి 97మంది10 వ తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు సిద్ధమై ఉన్నారని,పరీక్షలు బాగా రాసి ఉన్నత శిఖరాలను అధిరోహించి క్రింది తరగతుల వారికి ఆదర్శంగా నిలవాలని కోరారు.ప్రతి ఒక్కరూ నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించి ఉపాధ్యాయులకు,పాఠశాలకు,కన్న తల్లిదండ్రులకు పేరుప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు అనంతరం విద్యార్థినీ విద్యార్థులు ఆటపాటలతో పాటు నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సీహెచ్ వివిఎస్ఎన్ మూర్తి,ఎం కొండబాబు,బి నాగేశ్వరరావు,నానాజీ,పోసిబాబు,జి వెంకటరమణ,పాల్ బాబు,ఎస్ ఆపారావు, ఎ అప్పారావు,విఘ్నేశ్వరరావు,శాంతిప్రియ, విద్యా కమిటీ సభ్యులు ఆలీ,పాపాని బద్రి,బి శ్రీను,కె ప్రశాంత్ కుమార్,పాఠశాల వంట సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## ఆర్ అండ్ బి శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ,ని ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ మర్యాదపూర్వకంగా కలిసారు.



సింగనమల(జనం రిపోర్టర్) :నియోజకవర్గ పరిధిలోని శింగనమల మరవకొమ్మ రోడ్డును జాతీయ రహదారితో కలిపే విషయమై మంత్రి ,తో చర్చించారు అలాగే మరువకొమ్మ వద్ద బస్ స్టాప్ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే గతంలో వరదలు ఎక్కువగా వచ్చి, చెరువు నీరు ఉధృతంగా ప్రవహించి, మరవకొమ్మ రోడ్డు మీద రాకపోకలు నెలల తరబడి నిలిచిపోయాయని తెలిపారు.అనేక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారని మంత్రి ,కి వివరించారు.ఈ నేపథ్యంలో మరవకొమ్మ రోడ్డు మీద ఫ్లై ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కోరారు.మంత్రి జనార్ధన్ రెడ్డి సమస్యలు పై సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ పేర్కొన్నారు.

## సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ లో భారీ ధర్నా.... కాంటాక్ట్ కార్మికులకు కనీస వేతనం నెలకు 26,000 రూపాయలు నిర్ణయించాలని డిమాండ్....




రామగుండం(జనం రిపోర్టర్) :రామగుండం:మార్చ్ 06. కనీస వేతనం నెలకు రూ.26 వేలుగా నిర్ణయించాలని సిఐటియు ధర్నా. పెరుగుతున్న నిత్యవసర సరుకుల, వస్తువుల ధరలకు అనుగుణంగా కనీస వేతనం నెలకు 26000 నిర్ణయించాలని డిమాండ్ చేస్తూ గురువారం పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేల్పుల కుమారస్వామి, ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 73 షెడ్యూల్డ్ ఎంప్లాయ్మెంట్లలో కనీస వేతనాల డ్రాఫ్ట్ జిఓలను, 2024 జనవరి 29న. విడుదల చేసిందని, వేతనాలు నిర్ణయం ఆశాస్త్రీయంగా చేసింది. ఉన్న కరువు భత్యం (విడిఏ)ను ప్రస్తుతం పొందుతున్న బేసిక్ వేతనంలో కల్పారే తప్ప కొత్త డ్రాఫ్ జిఓ లలో ఒక్క పైసా పెంచలేదు. ప్రభుత్వం విడుదల చేసిన డ్రాఫ్ట్ జిఓ లను సవరించాలని, కనీస వేతనం నెలకు 26 వేల రూపాయలుగా నిర్ణయించి అమలు చేయా లని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, ఐదు సంవత్సరాలకు ఒకసారి సవరించాల్సిన జిఓల కాల వ్యవధి ముగిసి 12 నుంచి 18 సంవత్సరాల కాలం గడిచినా సవరించ లేదు అన్నారు. దీనితో రాష్ట్రంలో కోటి 20 లక్షల మంది కార్మికులు, పెద్దపల్లి జిల్లాలోని సింగరేణి, ఎన్టీపీసీ, రైస్ మిల్, రైల్వే, మున్సిపల్, గ్రామపంచాయతీ, ట్రాన్స్పోర్ట్, బిల్డింగ్, ఆర్ ఎఫ్ సి ఎల్, బసంత నగర్, తదితర రంగాల్లో పనిచేస్తున్న వేలాది మంది కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు. చివరిసారిగా బిఆర్ఎస్ ప్రభుత్వం 2021లో ఐదు రంగాలకు రూ. 18,019/- గా సవరించి 5 జిఓ లను విడుదల చేసి గెజిట్లో ముద్రించకుండా తొక్కిపెట్టి అమలు చేయలేదు. ప్రస్తుత ప్రభుత్వం అంతకంటే తగ్గించి డ్రాఫ్ట్ జిఓలను విడుదల చేయడం అన్యాయం. గత బిఆర్ఎస్ ప్రభుత్వం, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం రెండు కూడా పారిశ్రామిక యజమానుల లాభాలను పెంచడం కోసం మాత్రమేకార్మికుల వేతనాలు పెంచడం లేదు. కనీస వేతనాల సలహా మండలిలో కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడే సిఐటియుతో పాటు కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలకు కూడా ప్రాతినిధ్యం కల్పించలేదు అన్నారు.ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన తప్పును సరిదిద్దుకొని రాబోయే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో కనీస వేతనం నెలకు 26 వేలుగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్రంలోని




కార్మిక సంఘాలను, కార్మికులను ఐక్యం చేసి సమరశీల పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్ ఎ ఓ శ్రీనివాస్ కి వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్, బిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శులు ఎం,రామాచారి, సిపెల్లి రవీందర్, తాండ్ర అంజయ్య, సిహెచ్, అరవింద్, వివిధ సంఘాల నాయకులు ఎన్, శంకర్, జి, లక్ష్మారెడ్డి, బ్రహ్మాచారి, మహేందర్, ఎండి, కాజా , లక్ష్మీనారాయణ, ఉపేందర్, బొంకూరి సాగర్, మల్లేష్, తిరుపతి,మహేష్, గట్టయ్య, చందు, సురేష్, అంబాల లక్ష్మణ్, శ్రీనివాస్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## టెన్త్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు తగు ఏర్పాట్లుపై సమీక్షా సమావేశం



రాజవొమ్మంగి,రంపచోడవరం(జనం రిపోర్టర్) :ఈ సంవత్సరం పదవ తరగతి పరీక్షలు పగడ్బందీగా నిర్వహించేందుకు తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. గురువారం స్థానిక ఐటీడీఏ సమావేశపుహాల్లో అన్ని ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన ప్రధాన ఉపాధ్యాయులతో, పదవ తరగతి పరీక్షాల చీఫ్ సూపర్డెంట్లతో, డిపార్ట్మెంట్ అధికారులతో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు పగడ్బందీగా నిర్వహించేందుకు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, అల్లూరి సీతారామరాజు జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీరావు, ఏజెన్సీ డీఈవో. వై.మల్లేశ్వరరావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం మాట్లాడుతూ 2025 పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు పగడ్బందీగా నిర్వహించేందుకు ఎక్కడికక్కడ పరీక్ష కేంద్రాలలో లైట్లు, ఫ్యాన్లు, త్రాగునీరు ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు. మార్చి 17న తెలుగు, మార్చి 19న హిందీ, మార్చి 21న ఇంగ్లీష్, మార్చి 22న సంస్కృత, మార్చి 24న లెక్కలు, మార్చి 26న ఫిజికల్ సైన్స్, మార్చి 28న బయాలజీ సైన్స్, మార్చి 29న ఒకేషనల్ కోర్స్, మార్చి 31న సోషల్ స్టడీస్ పరీక్షలు ఈనెల 17వ తారీకు నుండి ఈనెల 31 వ తారీకు వరకు ప్రతిరోజు ఉదయం 9 30 గంటల నుండి 12 45 గంటల వరకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు.ఏజెన్సీలోని అన్ని పరీక్ష కేంద్రాలకు పదవ తరగతి పరీక్షలు రాసే అభ్యర్థులు పావు గంట ముందు పరీక్ష కేంద్రాలకు హాజరుకావాలని ఆయన అన్నారు.ఏజెన్సీలోని పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో ప్రశాంతంగా పకడ్బందీగా పరీక్షలు రాసే విధంగా తగు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో టెన్త్ క్లాస్ ఎగ్జామినేషన్ అసిస్టెంట్ కమిషనర్ శశి కుమార్, రీజనల్ జాయింట్ డైరెక్టర్ విజయ భాస్కర్, డి ఆర్ పి రత్నరాజు,మండల విద్యాశాఖ అధికారి యం. సత్యనారాయణ, పదవ తరగతి పబ్లిక్ పరీక్షల చీఫ్ సూపర్డెంట్లు,డిపార్ట్మెంటల్ అధికారులు,అన్ని పాఠశాలలకు సంబంధించిన ప్రధాన ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పెగడపల్లి మండలం,ఎల్లాపూర్ గ్రామంలో లో డి హెచ్ పి ఎస్ నూతన గ్రామ కమిటీ నియామకం.

### డి హెచ్ పి ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరుగురాల భూమేశ్వర్...



)పెగడపల్లి (జనం రిపోర్టర్) : పెగడపల్లి మండల పరిధిలోని ఎల్లాపూర్ గ్రామంలో గురువారం దళిత హక్కుల పోరాట సమితి నూతన గ్రామ కమిటీని దళిత హక్కుల పోరాట సమితి నూతన కమిటీ ఎన్నికల కార్యక్రమానికి జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరుగురాళ్ల భూమేశ్వర్ హాజరయ్యారు.గ్రామ కమిటీ అధ్యక్షులుగా మోదుంపల్లి రాజు, ప్రధాన కార్యదర్శిగా మచ్చ అంజయ్య, ఉపాధ్యక్షులుగా మోదుంపల్లి లక్ష్మణ్, ఎండపల్లి భాస్కర్, సంయుక్త కార్యదర్శి గా మహంకాళి కిరణ్, మోదం పల్లి నరసయ్య, కోశాధికారిగా ఆరెల్లి కనకయ్యను ఎన్నుకున్నట్లు భుమేశ్వర్ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.దళితులకు రాజ్యాంగ హక్కులు నేటికీ దళితులకు అందని ద్రాక్ష లాగానే మిగిలాయన్నారు.కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత దేశవ్యాప్తంగా దళితులపై అణిచివేత దాడులు మహిళలపై అత్యాచారాలు హత్యలు కులవివక్షత అంటరానితనం కొనసాగుతుంది అన్నారు.ఈ కార్యక్రమంలో శనిగరపు ప్రవీణ్,మోదుంపల్లి మల్లయ్య,మల్లారపు నరసయ్య,ఆరేపల్లి మల్లయ్య, ఆరేపల్లి రాజయ్య, మోదుంపల్లి అంజయ్య,దీకొండ రాములు, మల్లారపు చిన్న నరసయ్య,మోదుంపల్లి నరసయ్య,మోదుంపల్లి అంజయ్య,మల్లారపు శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన ఉత్పత్తులకు ఢిల్లీ స్థాయిలో మంచి గుర్తింపు ఉంది.పిఓ కట్టా సింహాచలం



**రాజవొమ్మంగి,రంపచోడవరం, మార్చి 6 జనం రిపోర్టర్: ఏజెన్సీ లోను గిరిజనులు తయారుచేసిన తాటాకు వివిధ రకాలైన ఉత్పత్తులు, వెదురుతో తయారుచేసిన వివిధ రకాలైన ఉత్పత్తులకు ఢిల్లీ స్థాయిలో మంచి గుర్తింపు ఉందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. గురువారం స్థానిక ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి వారి చాంబర్లో ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం మాట్లాడుతూ మన దేశ రాజధాని అయినా ఢిల్లీ రాష్ట్రపతి భవన్‌లో భారతదేశ సాంస్కృతిక వైవిధ్యానికి సంబంధించిన వేడుకల సందర్భంగా రాష్ట్రపతి భవన్ వివిద్ కా అమృత్ మహోత్సవ్ మర్చి 6 నుండి 9 వ తేదీ వరకు జరుగుతుందని అదేవిధంగా కేంద్ర ప్రభుత్వ గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ,రాష్ట్ర ప్రభుత్వాలతో సహా పలుమంత్రిత్వ శాఖలు ఈ కార్యక్రమానికి సహకరించి, నిర్వహిస్తున్నాయి.ఈ మహోత్సవనికి రంపచోడవరం ఐటీడీఏ వెలుగు నుండి గిరిజన కళాకారులు కుంజం నాగమ్మ, కారం విజయ కుమారి, కుర్ల చిరంజీవి రెడ్డి రాష్ట్రపతి భవన్ లో జరిగే ఈ కార్యక్రమానికి హాజరయ్యారని ఆయన తెలిపారు. తాటాకుల ఉత్పత్తులు,వెదురుతో తయారుచేసిన వివిధ రకాల ఉత్పత్తులు రాష్ట్రపతి భవన్ లో ప్రదర్శన కి ఉంచడం జరిగిందని అదేవిధంగా ఇలాంటి కార్యక్రమం ద్వారా ఏజెన్సీ గిరిజన ఉత్పత్తిలు కి జాతీయ స్థాయి లో ప్రమోట్ చేయడం జరుగుతుంది ఆయన తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన యువతి యువకులకు తాటాకులతో తయారుచేసిన ఉత్పత్తులు, వెదురుతో తయారుచేసిన వివిధ రకాలైన ఉత్పత్తులు తయారు చేయటానికి ప్రోత్సహించడం జరుగుతుందని ఆయన తెలిపారు.**

## ప్రపంచ మహిళా దినోత్సవం జయప్రదం చేయండి.
## ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ మహిళ కమిటీ ఎటపాక .



ఎటపాక (జనం రిపోర్టర్) :అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం లక్ష్మీదేవి పేట పాఠశాల ఆవరణలో జరిగిన సమావేశంలో మహిళ అధ్యక్షురాలు ఎస్ గంగాభవాని మాట్లాడుతూ మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఎటపాక మండలం కేంద్రంలో మండల విద్యాశాఖ కార్యాలయం ఆవరణలో జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి అంగన్వాడి కార్యకర్తలు, సచివాలయ మహిళా సిబ్బంది




,రెవెన్యూ మహిళా సిబ్బంది ,వెలుగు మహిళలు ప్రజా ప్రతినిధులు ,మహిళా మణులు అందరూ హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పద్దం. పుల్లమ్మ పాయల. తులసి తుర్రం. రజిని శీలం. విజయ కుమారి గొంది .రాధ పోడియం. కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

## ఫేస్‌బుక్‌లో పరిచయం..
## పుస్తెలతాడుతో ఉడాయించిన మోసగాడు



ఫేస్‌బుక్‌లో పరిచయమైన వ్యక్తిని ఓ మహిళను నిలువునా మోసం చేశాడు. బంగారం మెరుగులు దిద్దుతానని నమ్మించి ఆమె పుస్తెలతాడుతో ఉడాయించాడు. అంతేకాకుండా ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని సదరు వివాహితపై బెదిరింపులకు కూడా దిగాడు.వెంగళరావునగర్, మార్చి 6: ఫేస్‌బుక్‌లో పరిచయమైన వ్యక్తిని ఓ మహిళను నిలువునా మోసం చేశాడు. బంగారం మెరుగులు దిద్దుతానని నమ్మించి ఆమె పుస్తెలతాడుతో ఉడాయించాడు. అంతేకాకుండా ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని సదరు వివాహితపై బెదిరింపులకు కూడా దిగాడు. హైదరాబాద్‌లోని మధురానగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని పోలీసుల కథనం ప్రకారం.. ఎల్లారెడ్డిగూడలో నివాసం ఉంటున్న వర్రె దయామణి (37) ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగిని. ఆమెకు ఫేస్‌బుక్‌లో మహేశ్ నారాయణ దాస్ అనే పేరుతో ఓ వ్యక్తి పరిచయం అయ్యాడు. తాను నగల వ్యాపారిని అని నమ్మించాడు. ఫిబ్రవరి 10వ తేదీన దయామణి ఫోన్ నెంబర్ అడిగి తీసుకున్నాడు. అనంతరం ఆమెను హనుమాన్ జువెల్లరీ అనే వాట్సాప్ గ్రూప్‌లో యాడ్ చేశారు. మహేశ్‌ను పూర్తిగా నమ్మిన దయామణి.. తన పుస్తెల తాడుకు మెరుగులు దిద్దాల్సి ఉందని చెప్పి.. ఇంటికి రమ్మని పిలిచింది. అప్పుడు దయామణి ఇంటికొచ్చి 40 గ్రాములు బంగారు పుస్తెల తాడును చూసి.. పనిముట్లు తెచ్చుకోలేదని.. దుకాణానికి వెళ్లి మెరుగుపెట్టి తీసుకొస్తానని చెప్పారు.పుస్తెలతాడు ఇవ్వడానికి మొదట్లో దయామణి నిరాకరించింది. దీంతో ఆధార్ కార్డు జిరాక్స్, జువెల్లరీ షాపు ఫొటోలతో పాటు తన తండ్రి ఫోన్ నెంబర్ అంటూ ఇచ్చాడు. మహేశ్ మాయమాటలు నమ్మిన దయామణి.. తాళిబొట్టును అతనికిచ్చింది. పొద్దున తీసుకెళ్లిన మహేశ్.. సాయంత్రమైనా తిరిగి పుస్తెల తాడు తీసుకురాకపోవడంతో దయామణి అనుమానంతో సోదరుడికి తెలిపింది. బంగారు పుస్తెల తాడు గురించి ఫోన్‌లో ఆరాతీయగా, దురుసుగా మాట్లాడి ఆ మోసగాడు ఫోన్ కట్ చేశారు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించాడు. తాను మోసపోయానని గ్రహించిన దయామణి మధురా నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## హత్య కేసు.
## . యూఏఈలో
## ఇద్దరు భారతీయులకు ఉరిశిక్ష



ఇద్దరు భారతీయులకు మరణశిక్ష పడింది. హత్య కేసు.. యూఏఈలో ఇద్దరు భారతీయులకు ఉరిశిక్ష యూఏఈ లో ఇద్దరు భారతీయులకు మరణశిక్ష ( పడింది. వేర్వేరు హత్య కేసుల్లో దోషులుగా తేలడంతో ఇద్దరు వ్యక్తులకు ఉరిశిక్ష అమలు చేశారు. ఈ విషయాన్ని విదేశాంగ మంత్రిత్వ శాఖ శీట గురువారం తెలిపింది. నిందితులు కేరళకు చెందిన మహమ్మద్ రినాష్ అరంగిలోట్టు, మురళీధరన్ పెరుమ్‌తట్ట వలప్పిల్‌గా పేర్కొందిఓ యూఏఈ వాసిని హత్య చేసిన కేసులో మహమ్మద్ రినాష్ దోషిగా తేలాడు. ఇక మురళీధరన్‌కు ఓ భారతీయుడిని హత్య చేసిన కేసులో శిక్ష పడింది. ఇద్దరికీ మరణశిక్ష విధిస్తూ యూఏఈలోని అత్యున్నత న్యాయస్థానం కోర్ట్ ఆఫ్ కాసేషన్ తీర్పు వెలువరించింది. శిక్ష అమలుపై యూఏఈ అధికారులు ఫిబ్రవరి 28న భారత రాయబార కార్యాలయానికి సమాచారం అందించారు. వీరిద్దరికీ అవసరమైన దౌత్య, న్యాయ సాయం అందజేసినట్టు విదేశాంగశాఖ వెల్లడించింది. మరణశిక్ష సమాచారాన్ని వారి కుటుంబ సభ్యులకు కూడా తెలియజేసినట్లు పేర్కొంది. రాయబార కార్యాలయం బాధిత కుటుంబ సభ్యులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు వెల్లడించింది. అంత్యక్రియల్లో వారు పాల్గొనేలా చర్యలు తీసుకోనున్నట్లు విదేశాంగ శాఖ తెలిపింది.కాగా, మూడు రోజుల క్రితం యూఏఈ జైలులో భారతీయ మహిళా షెహజాది ఖాన్‌కు ఉరిశిక్ష అమలు చేసిన విషయం తెలిసిందే. ఓ హత్య కేసులో ఆమెకు ఈ శిక్ష విధించారు. దాదాపు ఏడాది పాటు ఆమె న్యాయపోరాటం చేసినా ఫలితం లభించలేదు. ఫిబ్రవరి 15వ తేదీనే ఆమెను ఉరితీసినా.. ఆ సమాచారం ఆలస్యంగా వారి కుటుంబ సభ్యులకు చేరింది.

# ప్రతి సోమవారం కలెక్టరేట్లో జరిగే ప్రజా స్పందన గురించి ప్రజల ఆవేదన రాస్తున్నాం.

నార్పల(జనం రిపోర్టర్) :అర్జీ ఇచ్చిన 24 గంటల్లోనే మీ సమస్య పరిష్కరించబడినదిని మొబైల్ నెంబర్లకు మెసేజ్లు. సమస్య పరిష్కరించకపోగా మెసేజ్లు పెట్టి చేతులు దులుపుకుంటున్న అధికారులు.అయోమయంలో అర్జీదారులు.సంవత్సరాల పడి అర్జీలు ఇస్తున్నప్పటికీ అధికారులు చట్టపరంగా అధికారుల చేతుల్లో ఉన్నటువంటి సమస్యలు కూడా పరిష్కరించకపోవడం చాలా బాధాకరం.ఒకప్పుడు గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చిన వెంటనే సమస్యలు తీరేవి.పేరుకే ప్రజా స్పందన చర్యలు మాత్రం శూన్యం.స్పందన అర్జీలు ఇచ్చేకి. వచ్చే వారు వ్యవసాయ కూలీలు. మధ్యతరగతి వారు. రెక్కాడితే కానీ డొక్కాడని పేద ప్రజలు అర్జీలు ఇవ్వడానికి రావడం అధికంగా ఉన్నది.అధికంగా నష్టపోతుండేది ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ ప్రజలు.అర్జీలు ఇవ్వడానికి స్పందన కార్యక్రమానికి వచ్చేది కూడా దిగువ తరగతి సామాజిక వర్గాలకు సంబంధించిన వారు రావడం గమనార్హం. ప్రశ్నిస్తే పోలీసులకు పట్టిస్తాం అనే ధోరణిలో స్పందన కార్యక్రమం జరుగుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.ప్రజలు మాత్రం ప్రభుత్వానికి పన్నులు ప్రతి సోమవారం ఎలా చెల్లిస్తారో ఒకసారి వివరిస్తున్నాం అందరూ పరిశీలిద్దాం. బస్సులకు ఛార్జీ రూపంలో. ద్విచక్ర వాహనానికి పెట్రోల్ రూపంలో. ఆటో చార్జీలు రూపంలో. పన్నులు చెల్లిస్తూ. అదే కాకుండా జిరాక్స్ రూపంలో కూడా ప్రజలు పన్నును చెల్లిస్తున్నారు. ప్రభుత్వ అధికారులకు కూడా జీతాలకు సరిపడే విధంగా ప్రజలు పన్ను కడుతున్నారు అనే విషయం మనందరం కూడా గమనించాలి. ఇంకా భోజనాలకు అల్పాహారానికి టీలుకు కూల్ డ్రింక్స్ కు ఒక్కొక్క అర్జీదారుడుకి ప్రతి సోమవారం 500 రూపాయలు ఖర్చవుతుంది.ప్రతి సోమవారం 300 నుండి 500 మంది ప్రజలు అర్జీలు తీసుకొని ఎన్నిసార్లు ఫిర్యాదులు ఇచ్చినప్పటికీ చట్టపరిధిలో ఉన్న పనులు కూడా జిల్లా అధికారులు కావచ్చు కిందిస్థాయి అధికారులు కావచ్చు ఆ సమస్యలను పరిష్కరించకుండా.ఇటీవల కాలంలో జరిగిన సంఘటనలు దృష్టిలో పెట్టుకొని ఆలోచన చేస్తే అర్థమవుతుంది. సమస్యలు పరిష్కరించబడలేదని కొంతమంది అర్జీదారులు పురుగుల మందు తాగి ఆత్మహత్య ప్రయత్నం చేయడం లేదా వారి కవర్లో పెట్రోల్ బాటిల్స్ పెట్టుకుని కలెక్టర్ ఆఫీస్ లోకి రావడం ఒకరిద్దరూ రైతులు చనిపోవడం జరిగిన సంఘటనలు చూసి పరిశీలిస్తే ఇట్లే అర్థం అవుతాది అధికారుల నిర్లక్ష్యం.ఎవరైనా అర్జీదారుడు గట్టిగా ప్రశ్నిస్తే వెంటనే పోలీసులకు చెప్పి అరెస్టులు చేపించడం జిల్లా అధికారుల అందరికీ కూడా పొరపాటుగా మారినది. అన్ని శాఖల అధికారులు అలాగే నిర్లక్ష్యంగా ఉన్నారని చెప్పలేం కొంతమంది నిజాయితీపరులు కూడా ఉన్నారు.అధికంగా భూ సమస్యలు అనంతపురం జిల్లాలో ఉన్నాయి రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం గురించి ఎంత చెప్పినా కూడా తక్కువే. తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు. అసైన్మెంట్ చట్టం గురించి చెప్పనక్కర్లేదు ఏ ఒక్క రెవెన్యూ అధికారి కూడా అమలు చేసే దిశగా చర్యలు చేపట్టకపోవడం ఎస్సీ ఎస్టీలకు తీరని లోటుగా పరిగణించవచ్చు. అసైన్మెంట్ భూములు అమ్మినవారికి భూమి కొనినవారికి నేరస్థులుగా పరిగణించబడుతుంది అని చట్టం ఉన్నప్పటికీ చట్టాన్ని తుంగలో తొక్కుతున్న జిల్లా అధికారులు రెవిన్యూ మండల అధికారులు నిర్లక్ష్యం స్పష్టంగా కనబడుతున్నది. ఉన్నవాడు రాజకీయ బలం ఉన్నవాడు ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే చర్యలు తీసుకోలేని అధికారులు. పేదవాడు ఎక్కడైనా కూడా ఒక్క సెంటు భూమిని ఆక్రమించిన తన ఆధీనంలో ఉంచుకున్న వారిపైన వెంటనే జిల్లా కలెక్టర్ కూడా స్పందించి. అధికార యంత్రాంగమంతా పేదవాడి మీద పడడం వెంటనే సెట్టరీత్యా నేరమని నీతి వాక్యాలు చెప్పడం అన్ని చట్టాలుపేదవాడి పైనే ప్రయోగిస్తున్న అధికారులు.చట్టాన్ని అమలుపరిచే అధికారులు కనుమరుగయ్యారని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.అధికారులు జిల్లా యంత్రాంగం ఇప్పటికైనా మొద్దునిద్దర వీడి ప్రజలు సమస్యలను పరిష్కరిస్తారా. మరి కొందరు అధికారులైతే ఏకంగా స్పందన కార్యక్రమంలో పేకాట ఆడుతున్న కూడా పట్టించుకోని కలెక్టర్ . అవినీతి అధికారుల పైన ప్రజాస్వామ్యవాదులు ప్రజాసంఘాలు మేధావులు. ఆధారాలతో సహా ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన. అవినీతి అక్రమాలు వెలుగులోకి తెచ్చి స్పందన కార్యక్రమంలో ఇచ్చినా కూడా అవినీతి అధికారులకే అండదండలు జిల్లా అధికారులు నిలబడడం వారి నిర్లక్ష్యానికి అద్దంపడుతుందని స్పష్టమవుతుంది.ఇప్పటికైనా అధికారులు స్పందించి చట్ట పరిధిలో ఉన్నటువంటి సమస్యలు పరిష్కరిస్తారని ఆశిస్తున్నాం .ప్రజలందరూ కూడా సమస్యలపై ప్రశ్నించే దిశగా సిద్ధమవ్వాలని పిలుపునిస్తున్నాం.

## జనంపై బాంబులను
## జారవిడిచిన ఫైటర్ జెట్స్.. 15 మందికి గాయాలు



సైనిక విన్యాసాల్లో అపశృతి చోటుచేసుకున్నది. యుద్ధ విమానాలు ప్రమాదవశాత్తు జనంపై బాంబులను జార విడిచాయి. ఈ ఘటన దక్షిణ కొరియాలో జరిగింది. ఆ ప్రమాదంలో 15 మంది గాయపడ్డారు. : జనంపై బాంబులను జారవిడిచిన ఫైటర్ జెట్స్.. 15 మందికి గాయాలుసియోల్: దక్షిణ కొరియా)కు చెందిన ఫైటర్ జెట్( విమానాలు.. ప్రమాదవశాత్తు జనంపై బాంబులను జారవిడిచాయి. సైనిక విన్యాసాలు జరుగుతున్న సమయంలో ఈ ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో 15 మంది గాయపడ్డారు. రెండు ఫైటర్ విమానాలు.. సుమారు 8 బాంబులను విడిచినట్లు తెలుస్తోంది. నార్త్ కొరియా బోర్డర్ సమీపంలో ఉన్న పొచియాన్ నగరంలో ఈ ఘటన జరిగింది. ఎయిర్ ఫోర్స్ కేఎఫ్-16 విమానం ఈ విన్యాసాల్లో పాల్గొన్నది. ఈ ఘటన పట్ల విచారణ చేపట్టినట్లు దక్షిణ కొరియా వైమానిక దళం పేర్కొన్నది. నష్టం జరిగినందుకు క్షమాపణలు చెప్పింది. గాయపడ్డవారికి నష్టపరిహారాన్ని చెల్లించనున్నట్లు తెలిపింది. సైనిక విన్యాసాల్లో లైవ్ ఫైరింగ్ చేయడం వల్ల జనావాస ప్రాంతాల్లో నష్టం జరిగినట్లు తెలుస్తోంది.స్థానిక మీడియా ప్రకారం.. ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఒకరికి మెడలో, మరొకరికి భుజానికి బుల్లెట్లు దిగాయి. ఎంకే-82 బాంబులకు చెందిన 8 షెల్స్‌ను తమ ఫైటర్ విమానాలు జారవిడిచినట్లు ఎయిర్‌ఫోర్స్ ఓ ప్రకటనలో పేర్కొన్నది. ఓ విమానానికి చెందిన పైలట్ పొరపాటున జనావాస ప్రాంతంలో బాంబులను డ్రాప్ చేసినట్లు మిలిటరీ తెలిపింది. అయితే రెండో విమానం ఎందుకు తమ బాంబులను డ్రాప్ చేసిందో విచారణలో తేల్చాల్సి ఉందన్నారు. అన్ని రకాల లైవ్ ఫైరింగ్ విన్యాసాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

## టీటీడీ భక్తులకు గుడ్‌న్యూస్..
## అన్నప్రసాదాలలో అదనంగా 'వడ' ప్రసాదం ప్రారంభం



తిరుమలలోని తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద భవనంలో గురువారం నుంచి భక్తులకు అదనంగా వడ ప్రసాదాన్ని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ప్రారంభించారు. టీటీడీ భక్తులకు గుడ్‌న్యూస్.. అన్నప్రసాదాలలో అదనంగా 'వడ' ప్రసాదం ప్రారంభంతిరుమల : తిరుమలలోని ( తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద భవనంలో గురువారం నుంచి భక్తులకు అదనంగా వడ ప్రసాదాన్ని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, తాను బాధ్యతలు స్వీకరించిన తర్వాత అన్న ప్రసాదంమెనూలో భక్తులకు అదనంగా ఒక పదార్థం వడ్డించాలని ఆలోచన కలిగిందన్నారు.ఈ విషయాన్ని సీఎం నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లగా ఆయన అంగీకారంతో వడల వడ్డింపును ప్రారంభించామన్నారు. ఇప్పటికే భక్తులకు నాణ్యమైన దినుసులతో రుచికరమైన అన్న ప్రసాదాలు అందిస్తున్నట్లు



పేర్కొన్నారు. భక్తులకు పంపిణీ చేసే వడ తయారీలో శెనగపప్పు, పచ్చిమిర్చి, అల్లం, కరివేపాకు, కొత్తిమీర, పుదీనా, సోంపును ఉపయోగించనున్నామని వెల్లడించారు.అన్న ప్రసాద కేంద్రంలో ఇకపై ప్రతిరోజూ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు 35 వేల వడలను భక్తులకు వడ్డించనున్నట్లు వివరించారు. భవిష్యత్తులో ఈ సంఖ్యను మరింతగా పెంచి భక్తులకు రుచికరమైన భోజనం అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోజె.శ్యామలరావు, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, టీటీడీ బోర్డు సభ్యులు శాంతా రామ్, డిప్యూటీ ఈవోలు లోకనాథం, రాజేంద్ర, క్యాటరింగ్ ప్రత్యేక అధికారి శాస్త్రి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## జనసేన ఎమ్మెల్సీ అభ్యర్థిగా నాగబాబు ఏపీలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థిగా తన సోదరుడు కొణిదెల నాగబాబు పేరును జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ బుధవారం ప్రకటించారు.



తెలుగు రాష్ట్రాల్లో ఖాళీ అవుతున్న ఎమ్మెల్యే కోటాలోని ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. ఏపీలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థిగా తన సోదరుడు కొణిదెల నాగబాబు పేరును జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ బుధవారం ప్రకటించారు. తెలుగు రాష్ట్రాల్లో ఖాళీ అవుతున్న ఎమ్మెల్యే కోటాలోని ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. మంగళవారం నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. ఏపీ అసెంబ్లీలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి 164 మంది సభ్యుల బలం ఉంది. దీంతో నాగబాబు ఎన్నిక లాంఛనం కానున్నది.

ఏటా 15% ఫీజులు పెంచుకోనివ్వండి బడా స్కూళ్లను వదిలిపెట్టి చిన్నా చితకా స్కూళ్లపై బ్రహ్మాస్త్రాలు గురిపెట్టవద్దని పలు ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు ప్రభుత్వాన్ని కోరాయి. ఫీజుల నియంత్రణ పేరుతో బడ్జెట్ స్కూళ్లను ఇబ్బందిపెట్టవద్దని పునరుద్ఘాటించాయి.

## కార్పొరేట్లను వదిలి మాపై బ్రహ్మాస్త్రమా?
## ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాల వినతి

### ఫీజుల నియంత్రణ చట్టంపై విద్యాశాఖ చర్చలు

హైదరాబాద్, బడా స్కూళ్లను వదిలిపెట్టి చిన్నా చితకా స్కూళ్లపై బ్రహ్మాస్త్రాలు గురిపెట్టవద్దని పలు ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు ప్రభుత్వాన్ని కోరాయి. ఫీజుల నియంత్రణ పేరుతో బడ్జెట్ స్కూళ్లను ఇబ్బందిపెట్టవద్దని పునరుద్ఘాటించాయి. ఫీజు నియంత్రణ చట్టం రూపకల్పనపై పాఠశాల విద్యాశాఖ బుధవారం సంప్రదింపులు జరిపింది.




సైఫాబాద్‌లోని పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్‌లో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో చర్చించింది. పలు సంఘాల ప్రతినిధులు తమ వాదనలు వినిపించారు. ఏటా 15శాతం ఫీజులు పెంచుకునే వెసులుబాటు కల్పించాలని కోరారు. ఫీజుల పెంపు 15శాతం మించితేనే ఫీజు రెగ్యులేటరీ కమిటీ ఆధీనంలోకి తీసుకురావాలని సూచించారు. ప్రొఫెసర్ తిరుపతిరావు కమిటీ సిఫారసులు అమలుచేయాలని కోరారు. లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలల్లో ఫీజుల నియంత్రణపై దృష్టిపెట్టాలని పేర్కొన్నారు. ఫీజు రెగ్యులేటరీ కమిటీలను ఏర్పాటు చేస్తే ఫీజుల నియంత్రణ అదుపు తప్పి, అవినీతి పెరుగుతుందని ఓ పాఠశాల యజమాని తన వాదన వినిపించారు.

## గోదాముల్లో అవకతవకలు జరిగితే సహించం: నాదెండ్ల



అమరావతి: స్టాక్ పాయింట్లుగా ఉన్న బఫర్ గోదాముల్లో ఎఐ సిసి కెమెరాల ఏర్పాటు చేశామని ఎపి పౌరసరఫరా శాఖ నాదెండ్ల మనోహర్ తెలిపారు. రేషన్ బియ్యం స్మగ్లింగ్ పై ప్రత్యేక దర్యాప్తు బృందం పని చేస్తోందని అన్నారు. నాదెండ్ల మీడియాతో మాట్లాడుతూ.. 18 లక్షల మెట్రిక్ టన్నులు నిల్వ చేసేలా గోదాములు ఉన్నాయని, ప్రైవేటు గోదాముల్లో జరుగుతున్న అవకతవకలు బయటపడ్డాయని చెప్పారు. మచిలీ పట్నంలోని జెఎస్ గోదాముల్లో స్టాక్ తగ్గిందని గుర్తించి, రూ. 1. 70 కోట్లు జరిమానా కూడా వేశామని తెలియజేశారు. మరో రూ. 1.67 కోట్లు జరిమానా కట్టాలని నోటీసులు కూడా జారీ చేశామన్నారు. బేతంచర్లలోని గోదాములో 637 మెట్రిక్ టన్నుల సరకు తగ్గినట్టు గుర్తించామని వివరించారు. వీరందరిపైనా క్రిమినల్ కేసులతో పాటు బ్లాక్ లిస్టులోనూ పెట్టామని, పిడిఎస్ గోదాములపై పౌరసరఫరా శాఖ చాలా సంస్కరణలు చేపట్టిందని పేర్కొన్నారు. ప్రతినెలా గోదాములను తనిఖీ చేయాల్సిందిగా ఆదేశాలు ఇచ్చామన్నారు. గతంలో పెద్ద ఎత్తున పిడిఎస్ బియ్యం అక్రమాలు జరిగాయని, వీటన్నిటిపైనా ప్రక్షాలన చేసేందుకు ప్రయత్నం చేస్తున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు.

## తమ పౌరులపైనే బాంబులు జారవిడిచిన వైమానిక దళం




సియోల్ : దక్షిణ కొరియా యుద్ధవిమానం గురువారం పొరపాటున తమ పౌరులపైనే బాంబులు జారవిడించింది. ఈ ఘటనలో ఎనిమిది మంది గాయపడినట్లు వైమానిక శాఖ అధికారి ఒకరు తెలిపారు. ఉత్తర కొరియా సరిహద్దులోని పొచియాన్ నగరంలో, శిక్షణ సమయంలో ఈ ఘటన జరిగిందని అన్నారు. కెఎఫ్-16 యుద్ధవిమానం విడుదల చేసిన ఎంకె-82 బాంబులు ప్రమాదవశాత్తు కాల్పుల పరిధి వెలుపల పడటంతో పౌరులు గాయపడినట్లు వైమానిక దళం ఒక ప్రకటనలో తెలిపింది. ఎనిమిది మంది గాయపడగా, వారిలో ఇద్దరు సైనికులు ఉన్నారని పేర్కొంది. నలుగురు పౌరుల పరిస్థితి విషమంగా ఉందని, వారిలో థాయ్, మయన్మార్‌కు చెందిన ఇద్దరు విదేశీయులు ఉన్నారని తెలిపింది. ప్రమాదానికి గల కారణం, పౌర నష్టంపై దర్యాప్తు చేసేందుకు ఒక కమిటీని నియమించినట్లు పేర్కొంది. ఆ యుద్ధ విమానం వైమానిక దళం, సైన్యంతో కలిసి నిర్వహించే సంయుక్త లైవ్ ఫైరింగ్ విన్యాసాల్లో పాల్గందని తెలిపింది. ఈ ఘటనపై వైమానిక దళం ప్రజలకు క్షమాపణలు తెలిపింది. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆశాభావం వ్యక్తం చేసింది. పరిహారంతో పాటు ఇతర అవసరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించింది.

## ఉదయనిధి స్టాలిన్‌పై కొత్త కేసులు నమోదు చేయవద్దు



న్యూఢిల్లీ : సనాతన ధర్మంపై తమిళనాడు ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యలపై కొత్త కేసులు నమోదు చేయవద్దని గురువారం సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ కోర్టు అనుమతి లేకుండా తదుపరి కేసులు నమోదు చేయకూడదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజరు కుమార్‌లతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. అలాగే ఉదయనిధి స్టాలిన్‌కు అరెస్ట్ నుండి మధ్యంతర రక్షణను పొడిగించినట్లు ధర్మాసనం పేర్కొంది. సీనియర్ న్యాయవాదులు ఎ.ఎం.సింఘ్వీ, పి.విల్సన్‌లు ఉదయనిధి స్టాలిన్ తరపున వాదనలు వినిపించారు. బీహార్‌లో ఆయనపై కొత్త ఎఫ్ఐఆర్ దాఖలు చేసినట్లు కోర్టుకు తెలిపిన అనంతరం ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఉప ముఖ్యమంత్రి హోదా కలిగిన వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఏమిటని మహారాష్ట్ర తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. అయితే ప్రస్తుతం ఈ కేసు హోదాపై తాము ఎలాంటి వ్యాఖ్యలు చేయమని ధర్మాసనం పేర్కొంది.

## గాజాపై బెదిరింపులకు దిగిన ట్రంప్



వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షులు ట్రంప్ గాజాపై బెదిరింపులకు దిగారు. మిగిలిన బందీలందరినీ విడుదల చేయకుంటే మీరు చచ్చినట్లేనని బుధవారం హమాస్ నేతలను బెదిరించారు. హమాస్ నేతలు గాజా విడిచి పారిపోవాలని అల్టిమేటం జారీ చేశారు. ట్రంప్ ప్రభుత్వం బిలియన్ డాలర్ల ఆయుధాలను వేగవంతం చేస్తున్నందున ఇజ్రాయిల్‌కు మద్దతు ప్రకటిస్తూ.. పని పూర్తి చేయడానికి ఇజ్రాయిల్‌కు అవసరమైన ఆయుధాలను పంపుతామని పేర్కొన్నారు. బందీలందరినీ ఇప్పుడు విడుదల చేయండి. తరువాత కాదు. మీరు హత్యచేసిన వ్యక్తుల మృతదేహాలన్నింటినీ వెంటనే తిరిగి అప్పగించండి. లేకపోతే ఇక మీరు చచ్చినట్లే అని ట్రంప్ తన సోషల్‌మీడియా ఖాతా ట్రూత్‌లో పేర్కొన్నారు. ఇటీవల విడుదలైన బందీలను కలిసిన తర్వాత ఈ ప్రకటన చేశారు. "ఇదే మీకు చివరి హెచ్చరిక. గాజాను వదిలి వెళ్లాల్సిన సమయం వచ్చింది" అని హమాస్ నేతలను బెదిరించారు. గాజా ప్రజల కోసం మంచి భవిష్యత్తు ఎదురుచూస్తోందని, కానీ మీరు బందీలను విడుదల చేయకుంటే గాజా అంతటా పరిణామాలు తీవ్రంగా ఉంటాయని అన్నారు. బందీలను విడుదల చేయకుంటే మీరు చచ్చినట్లే అని పేర్కొన్నారు. అక్టోబర్ 7 దాడిలో అదుపులోకి తీసుకున్న మిగిలిన బందీలను హమాస్ అప్పగించకపోతే మీరు ఊహించలేని పరిణామాలు ఉంటాయని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూ హెచ్చరికల అనంతరం ట్రంప్ ప్రకటన వెలువడింది.

## అసెంబ్లీ సమావేశాలు

అమరావతి : శాసనసభలో 2025-2026 వార్షిక బడ్జెట్ పై బుధవారం తుది చర్చ జరిగింది. గురువారం ఏడో రోజు అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రులు సమాధానమిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2027 నాటికి భూముల రీ సర్వే పూర్తి చేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ నిన్న జరిగిన శాసనభలో వెల్లడించారు. రేషన్ కార్డును సర్టిఫికెట్ లా ప్రజలు భావిస్తున్నారని, అందుకే రేషన్ కార్డు బదులు రైస్ కార్డుగా జారీ చేస్తున్నామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ శాసనసభకు వివరించారు. తమిళనాడుతో పోలిస్తే ఎపి ఐఐసీ కేటాయిస్తున్న భూమి విలువలు ఎపిలో చాలా తక్కువ ఉన్నాయని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. వెయ్యి కోట్లకు పైబడిన పెట్టుబడులు ఉంటే అతి తక్కువ రేటుకే భూములు కేటాయిస్తున్నామని మంత్రి చెప్పారు. బ్యాంకులతో డెబ్ట్ స్వాపింగ్ పై చర్చలు జరుపుతున్నట్లు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ శాసనసభలో వెల్లడించారు. గత ప్రభుత్వం తెచ్చిన అప్పులన్నీ దీర్ఘకాలిక రుణాలుగా మార్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు.

# గురి తప్పకూడదు...




విలు విద్య పరీక్షకు సంబంధించి 'నీకేం కనబడుతోంది నాయనా' అని ద్రోణాచార్యుడు అడగ్గా 'నాకు చెట్టు కాదు.. దాని కొమ్మలు కాదు, పిట్ట కూడా కాదు.. పిట్టకన్ను మాత్రమే కనబడుతోంది గురు వర్యా' అని బదులిచ్చాడట అర్జునుడు. ఇప్పుడీ భారత కథకు, ప్రస్తుత రాజకీయాలకు ఎంతో సంబంధముంది. రాష్ట్రంలో తాజాగా జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒక పట్టభద్రుల నియోజకవర్గం, మరో ఉపాధ్యాయ నియోజకవర్గంలో బీజేపీ, దాని మద్దతుదారులు గెలిచారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఎనిమిది ఎమ్మెల్యే స్థానాలను గెలుచుకున్న ఆ పార్టీ, ఆ తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఎనిమిది ఎంపీ స్థానాలను కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. ఎంపీ ఎన్నికలకు ముందు బీజేపీని నిలువరించేందుకోసం ఏర్పడ్డ ఇండియా బ్లాక్ కాషాయ పార్టీ సీట్లను తగ్గించగలిగినా, అధి కారంలోకి రావటాన్ని మాత్రం అడ్డుకోలేక పోయింది. ఆ తర్వాత వివిధ రాష్ట్రాల్లో ముఖ్యంగా ఢిల్లీలో జరిగిన ఎన్నికల ఫలితాలను చూశాం. ఆప్, కాంగ్రెస్‌లే ఆయా ఫలితాలకు పూర్తి బాధ్యత వహించాలనే విమర్శలు వెల్లువెత్తిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో ఇటీవల తెలంగాణ లోని రాజకీయ పరిస్థితులను సైతం నిశితంగా పరిశీలిస్తే' ఉత్తరాదిన తలెత్తిన వైఫల్య'మే ఇక్కడా స్పష్టమవుతోంది. కొద్ది నెలల క్రితం ముఖ్యమంత్రి రేవంత్ ప్రధాని మోడీని 'బడే భారు' అని పొగడటాన్ని పలువురు ఆక్షేపించారు. 'రాష్ట్ర ప్రభుత్వాలకు, కేంద్రానికి అనేక విషయాల్లో సంబంధాలుంటాయి, తెలంగాణకు సంబంధించిన ప్రాజెక్టులు, నిధుల గురించే నేను మోడీని అలా పొగడాల్సి వచ్చింది' అంటూ సీఎం సమర్థించుకోజూసినా ఆయనపై విమర్శలు ఆగలేదు. ఇటీవల ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పర్యటన సందర్భంగా మరోసారి అలాంటి వ్యాఖ్యలనే చేసిన రేవంత్ వ్యవహారశైలిపై ఇప్పుడు చర్చోపచర్చలు కొనసాగుతున్నాయి. 'మోడీ మంచోడే, ఆయన రాష్ట్రానికి మంచే చేయాలని చూస్తున్నారు, కానీ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డే అడ్డుకుంటున్నారు' అంటూ వ్యాఖ్యానించటం ద్వారా మాజీ పీసీసీ అధ్యక్షుడైన ముఖ్యమంత్రి మరోసారి చర్చకు తెరలేపారు. దేశానికి ప్రమాదకరంగా పరిణమించిన బీజేపీని నిలువరించేందుకు, దాన్ని ఓడించేందుకు జాతీయ స్థాయిలో ఇండియా బ్లాక్, దాని భాగస్వామ్య పక్షాలు కృషిచేస్తున్న క్రమంలో ఆ బ్లాక్‌కు పెద్దన్న అయిన కాంగ్రెస్ సీఎంగా ఉన్న రేవంత్ ఇలాంటి కామెంట్లు చేయటం విస్మయాన్ని కలిగిస్తోంది. మోడీ మంచోడే అయితే, ఇక బీజేపీని వ్యతిరేకించాల్సిన పనేముంది? సీఎం చెప్పినట్టు రాష్ట్రానికి మంచి చేయాలనే తలంపే మోడీకి ఉంటే, విభజన హామీలు ఎందుకు అటకెక్కినట్టు? పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర బడ్జెట్‌లో రూ.15 వేల కోట్ల నిధులిచ్చిన మోడీ తెలంగాణకు చిల్లిగవ్వ కూడా ఎందుకివ్వనట్టు? ఒకవేళ నిజంగా రాష్ట్రానికి మంచి చేయాలని మోడీ తలిస్తే కిషన్‌రెడ్డి అడ్డుకోగలరా? ఆపగలరా? అనే సూటి ప్రశ్నలకు సీఎం సమాధానం చెప్పాల్సి ఉంటుంది. గత లోక్‌సభ ఎన్నికల్లోగాని, ఇప్పటి ఎమ్మెల్సీ ఎన్నికల్లోగానీ ప్రతిపక్ష 'బీఆర్ఎస్ కోరుకున్నదే' జరిగిందనే విశ్లేషణలూ వచ్చాయి. కాంగ్రెస్‌పై కోపంతో ఎంపీ ఎన్నికల్లో అనేక సీట్లలో తన ఓటు బ్యాంకునంతటినీ గంపగుత్తగా 'కమలానికి' తాకట్టు పెట్టిందనే ఆరోపణలను కారు పార్టీ ఎదుర్కొన్నది. ఫలితాలు చూస్తే ఇది నిజమేననే సందేహాలు రాకమానవు. ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా ఇదే వ్యూహాన్ని అనుసరించిన 'గులాబీ దళపతి' మూడు స్థానాల్లోనూ తమ పార్టీ అభ్యర్థులను నిలబెట్టకుండా 'కాషాయ పార్టీకి' ఎర్రతివాచీ పరిచారనే అభిప్రాయం నెలకొంది. రాష్ట్ర ప్రయోజనాలకు గోతులు తీస్తున్న బీజేపీ పట్ల కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు అనుసరిస్తున్న ఈ రకమైన రాజకీయ విధానాలు తెలంగాణకు, ఇక్కడి ప్రజానీకానికి తీవ్ర ప్రమాదమని అభ్యుదయవాదులు, సామాజికవేత్తలు నెత్తీనోరు బాదు కుంటున్నారు. అయినా 'నేనోడినా ఫరవాలేదు, వాడు మాత్రం గెలవొద్దు' అనే పద్ధతుల్లో బీఆర్ఎస్ వ్యవహరిస్తుండటం శోచనీయం. రాష్ట్రంలో పరిస్థితులు ఇంత సంక్లిష్టంగా ఉన్న సమయంలో ముఖ్యమంత్రి హోదాలో తెలంగాణ కాంగ్రెస్‌ను ముందుండి నడిపిస్తున్న సీఎం చూపు 'మిగతా అంశాల చుట్టూ కాకుండా' పిట్ట కన్నులాంటి 'బీజేపీ'పైన్నే ఉండాలి. అలా లేకపోవటం వల్లే గులాబీ పార్టీ ఇక్కడ చతికిలబడిందనే నగసత్యాన్ని ఆయన మరువరాదు. అందు వల్ల రాష్ట్రాల హక్కులు, నిధులు, విధుల విషయంలో బీజేపీతోపాటు దానికి నేతృత్వం వహిస్తున్న 'బడే భారు'తో నిక్కచ్చిగా పోరాడితేనే ప్రజలకూ, ఆ పార్టీలకూ ప్రయోజనం తప్పితే ఇలా సన్నాయి నొక్కులతో ఫలితముండబోదని గుర్తించాలి.

## కాల్పుల విరమణకు ఇజ్రాయెల్ తూట్లు



యుద్ధోన్మాదంతో కన్నూమిన్నూ కానకుండా ప్రవర్తిస్తున్న ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు సంధియత్నాలు రుచించడం లేదు. కాలికి వేస్తే మెడకు, మెడకు వేస్తే కాలికి అన్న చందంగా కాల్పుల విరమణ ఒప్పందానికి కొత్త భాష్యాలు చెబుతూ గాజాపై మరోసారి మారణహోమానికి పాల్పడేందుకు దారులు వెతుకుతున్నారు. మూడు దశల కాల్పుల విరమణ ఒప్పందంలో భాగమైన తొలి దశ శనివారంతో ముగియగా, సరిగ్గా ఒక రోజు ముందు ఆయన అడ్డం తిరిగి, రెండో దశ ఒప్పందంపై చర్చలను అయోమయంలోకి నెట్టివేశారు. తొలి దశ కాల్పుల విరమణ ఒప్పందాన్ని రంజాన్ మాసం ముగిసేవరకూ కొనసాగించాలంటూ కొత్త ప్రతిపాదనను ముందుకు తెచ్చారు. అంతేకాదు, రెండో దశ ఒప్పందంపై చర్చలు మొదలుపెట్టిన తొలి రోజునే హమాస్ తన వద్ద ఉన్న బందీల్లో సగం మందిని విడచిపెట్టాలని పట్టుబడుతున్నారు. హమాస్ అధీనంలో ఇప్పటికీ 59మంది బందీలు ఉన్నారు. వీరిలో 24మంది సజీవంగా ఉండగా, మిగిలిన 35మందిని ఏనాడో హమాస్ ఉగ్రవాదులు హతమార్చారు. ఆరువారాల మొదటి దశ కాల్పుల విరమణ మార్చి 1తో ముగిసింది. ఈలోగా గాజానుంచి ఇజ్రాయెల్ దళాలు పూర్తిగా వైదొలగి, ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని చెట్టుకొకరు, పుట్టకొకరుగా తరలిపోయిన గాజావాసులు స్వస్థలాలకు తరలివచ్చేందుకు మార్గం సుగమం చేయాలన్నది ఇరువర్గాల మధ్య కుదిరిన ఒడంబడిక. అలాగే గాజాకు మానవతాసాయం పెంచాలన్నది కూడా ఒప్పందంలో ఒక భాగం. అయితే, ఇప్పటికీ గాజాలోని కొన్ని ప్రాంతాలనుంచి సైనిక దళాల ఉపసంహరణ చేపట్టకుండా నాన్చుడు ధోరణి కనబరుస్తున్న ఇజ్రాయెల్, మరికొంతకాలం గాజాను తమ అధీనంలో ఉంచుకునేందుకే ఈ ఎత్తుగడ వేసిందన్నది హమాస్ ఆరోపణ. తమ కొత్త ప్రతిపాదన అమలు దిశగా హమాస్ పై ఒత్తిడి పెంచేందుకు గాజాకు అందుతున్న మానవతాసాయాన్ని ఇజ్రాయెల్ ఎక్కడికక్కడ అడ్డుకుంటోంది. అంతేకాదు, గాజా-ఈజిప్ట్ సరిహద్దుల్లో మోహరించిన తమ సైన్యాన్ని వెనక్కు రప్పించే యోచనను విరమించుకుంటున్నట్లు కూడా ప్రకటించింది. ఈ పరిమాణం పట్ల ఐక్యరాజ్య సమితి సైతం ఆగ్రహం వెలిబుచ్చినా నెతన్యాహు ఖాతరు చేయడం లేదు. కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి వచ్చిన ఈ ఆరువారాల్లోనూ అందు కు ఇజ్రాయెల్ పూర్తిగా కట్టుబడిన దాఖలాలు కూడా లేవు. అనేక సందర్భాల్లో గాజాపై వైమానిక దాడులు జరపడం, స్వస్థలాలకు చేరుతున్న పాలస్తీనియన్లకు అడుగడుగునా అడ్డుపడటం వంటి అకృత్యాలకు పాల్పడుతూనే ఉంది. తమ తాజా ప్రతిపాదనకు అమెరికా మద్దతు ఉందని నెతన్యాహు చెప్పుకుంటున్నప్పటికీ, ఈ విషయంలో అగ్రరాజ్యం తన వైఖరిని ఇంకా స్పష్టం చేయలేదు. తనను తాను శాంతిదూతగా అభివర్ణించుకుంటున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్.. ఇజ్రాయెల్-హమాస్ కాల్పుల విరమణ ఒప్పందం తాలూకు ఘనతను కూడా తన ఖాతాలో వేసుకున్నారు. ఈ నేపథ్యంలో తాజా పరిణామాల పట్ల ఆయన వైఖరి ఎలా ఉండబోతోందన్నది ఆసక్తికరంగా మారింది. మిత్రదేశాలతోనూ కోరి శత్రుత్వం కొని తెచ్చుకుంటున్న అగ్రరాజ్యాధినేత, తన చిరకాల మిత్రదేశం ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ఒడంబడికకు తూట్లు పొడుస్తుంటే సహిస్తారా లేక చీవాట్లు పెడతారా అనేది ప్రశ్నార్థకంగా మారింది. గాజాను స్వాధీనం చేసుకుని అభివృద్ధి చేస్తామంటూ తెలివిమాలిన ప్రకటనలు చేస్తూ, గందరగోళాన్ని మరింత పెంచిపోషిస్తున్న ట్రంప్ మహాశయుడు కాల్పు ల విరమణకు కట్టుబడేలా ఇజ్రాయెల్ ను దారికి తెస్తే, శాంతికాముకుల ప్ర శంసలు పొందగలుగుతారనడంలో సందేహం లేదు. అయితే స్వప్రయోజనాలకు, స్వలాభాలకు మాత్రమే పెద్దపీట వేస్తున్న ట్రంప్ గాజావాసుల మనోభావాలను అర్థం చేసుకుంటారని, ఒప్పందానికి కట్టుబడేలా ఇజ్రాయెల్ మెడలు వంచుతారనీ ఆశించలేం. రష్యాతో యుద్ధానికి తెరదించేలా ఉక్రెయిన్ పై ఒత్తి డి తెచ్చి, పనిలో పనిగా ఆ దేశంలో అరుదైన ఖనిజాల వెలికితీత పనుల తాలూ కు కాంట్రాక్టును సాధించేందుకు ప్రయత్నించిన ట్రంప్.. ఇజ్రాయెల్‌తో కోరి విభేదాలు కొని తెచ్చుకునే అవకాశం లేదు. హమాస్ తో యుద్ధం చేస్తున్న ఇజ్రాయెల్, గత ఏడాదిన్నర కాలంలో కొన్ని వేల కోట్ల రూపాయల ఆయుధాలను అమెరికానుంచి కొనుగోలు చేసిన సంగతి ఈ సందర్భంగా గమనార్హం. మరో విషయం ఏమిటంటే, గాజాలో శాశ్వత శాంతి కోసం చర్చలు జరుగుతు న్న ప్రస్తుత సమయంలో 300 కోట్ల డాలర్ల విలువైన ఆయుధ సంపత్తిని ఇజ్రాయెల్ కు విక్రయించేందుకు అమెరికా అంగీకరించడం తాజా పరిణామం.

## కొలువులపై కోటి ఆశలు




భారతదేశంలో మిగితా రాష్ట్రాలు భౌగోళికంగా ఏర్పడితే, తెలంగాణ ఒక భావోద్వేగ రాష్ట్రం, కదిలిస్తే ఇక్కడ అమరవీరుల తల్లుల కన్నీళ్లు కన్పిస్తాయి. నీళ్లు, నిధుల కోసం నాయకులు కొట్లాడితే, కొలువులే కొలమానంగా తొలినుండి తుది తెలంగాణ ఉద్యమంలో కొట్లాడింది విద్యార్థులే. తెలంగాణ వస్తే కోరుకున్న కొలువు వస్తదని, గొప్పగా బతుకుతామని విద్యార్థులు తమ జీవితాలను లెక్కచేయకుండా, ప్రాణాలను పణంగాపెడితే ఆ త్యాగల పునాదులపై తెలంగాణ పురుడుపోసుకున్నది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే తొలి ఫలితం విద్యార్థులకే దక్కాలి. అది వారి హక్కు కూడా. యేండ్లకేండ్లు కుటుంబాలకు దూరంగా, అర్ధాకలితో, 5 రూపాయల భోజనం చేస్తూ, అగ్గి పెట్టే అంత సైజు గదిలో ఉంటూ, అప్పులుచేస్తూ పోటీ పరీక్షలకు ప్రాణం పెట్టి చదివే నిరుద్యోగులు, తమ ఉద్యోగ కలలను సాకారం చేసుకోవాలనే పట్టుదలతో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం ఉద్యోగాల భర్తీ విషయంలో నిరుద్యోగుల నిరాశని, అసంతృప్తిని, ఆందోళనని, భయాన్ని, దయనీయస్థితిని అర్థం చేసుకొవాలి. కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం ఉద్యోగాల భర్తీని వెంటనే అత్యంత ప్రాధాన్యత అంశంగా పరిగణించి యుద్ధప్రాతిపదికన భర్తీ చేయాలనీ నిరుద్యోగులంతా ప్రజాప్రభుత్వాన్ని ప్రార్థిస్తున్నారు. ప్రజా ప్రభుత్వం నిరుద్యోగుల ప్రభుత్వం అని చెప్పడం నిజంగా గొప్ప విషయం. ఇది నిరుద్యోగుల గౌరవాన్ని పెంచింది. కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో పెట్టిన 2 లక్షల ఉద్యోగాలు, చట్టబద్ధమైన జాబ్ క్యాలెండరు అనేది ఒక సంచలనం. పెండింగ్‌లో ఉన్న ఉద్యోగాలన్నీ శరవేగంగా భర్తీ చేసి కొత్త సంవత్సరంలో పకడ్బందీగ జాబ్ క్యాలెండరు అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. టిజిపిఎస్‌సి చైర్మన్ పదవీకాలం పూర్తికాకముందే కొత్త ఛైర్మన్‌ని నియమించడం మంచి పరిణామం. కోచింగ్ సెంటర్ల దోపిడీ నుండి గ్రామీణ పేద విద్యార్థలకు విముక్తి కల్పించి, తల్లిదండ్రులకు లక్షల రూపాయల కోచింగ్ ఫీజుభారం తగ్గించేలా అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుత జాబ్ క్యాలెండరు అమలుకు ముందే ప్రతి నియోజకవర్గంలో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లని ఏర్పాటు చేసి అనుభవజ్ఞులైన అధ్యాపకుల చేత ఖరీదైనా కోచింగ్‌ని ఉచితంగా అందించాలి. కాంగ్రెస్ అగ్రనాయకుడైనా రాహుల్ గాంధీ అశోక్‌నగర్ వచ్చి నిరుద్యోగుల బాధలను కళ్లారాచూసి చలించిపోయి సంవత్సరం తిరిగేలోగా 2 లక్షల ఉద్యోగాల భర్తీ, చట్టబద్ధమైన జాబ్ క్యాలెండరు, 25,000 టీచర్ ఉద్యోగాలతో మెగా డిఎస్‌సి, 4000 రూపాయల నిరుద్యోగ భృతి, పరీక్ష ఫీజులు వసూలు చేయమని, లైబ్రరీలని అభివృద్ధి చేస్తామని, పరీక్ష పరీక్షకి తగినంత సమయం అంటూ అనేక హామీలని ఆయన ఇచ్చారు. ఇగ కాంగ్రెస్ ప్రభుత్వంలో కొలువుల పండగే అనుకున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటు తర్వాత కేవలం 12 వేల ఉద్యోగాలనే భర్తీ చేసిందని, 2 లక్షల ఉద్యోగాలని ఇంకా ఎప్పుడు భర్తీ చేస్తుందనే నిరాశలో నిరుద్యోగులు ఉన్నారు. నిరుద్యోగులంటే అంత చిన్నచూపా. అవమానకరంగా నిరుద్యోగుల జీవితాలని తీసిపడేయడం ఏ విధంగా ప్రజాప్రభుత్వ గౌరవాన్ని పెంచుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా కొలువు వస్తదనీ అనుకున్న నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లినట్టే. నిరుద్యోగులంటే నిరక్షరాస్యులు కాదు, చదువుకున్న వారిని ఎల్లకాలం మోసం చేయలేరు. ఎప్పటికప్పుడు ఖాళీ అయ్యే ప్రతి ఉద్యోగాన్ని, ఖాళీ అయ్యే ముందు రోజు వరకే ఆ ఉద్యోగం భర్తీ అయ్యేలా ప్రభుత్వం కృషి చేయాలి. ప్రభుత్వం ఇచ్చే వందల ఉద్యోగాలకి లక్షలాది నిరుద్యోగులు పోటీ పడుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు పరిమితంగానే ఉంటాయి కాబట్టి ప్రభుత్వం ప్రయివేట్ ఉద్యోగాల భర్తీపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. తెలంగాణ బిడ్డలకి ఉద్యోగాలు ఇచ్చే కంపెనీలకు ప్రభుత్వం రాయితీలను, ప్రోత్సాహకాలను అందించాలి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డదే నియామకాల కోసం కాబట్టి, ప్రయివేటు ఉద్యోగాలలో 75% ఉద్యోగాలు స్థానికులకు దక్కేలా ప్రభుత్వం చట్టం తీసుకురావాలి. పరిశ్రమలకి కావాల్సింది నైపుణ్యం ఉన్న మానవ వనరులే కాబట్టి పరిశ్రమలకి అవసరమైనా సాంకేతిక నైపుణ్యాలని ప్రభుత్వమే అందించాలి. ప్రతి మండలంలో నైపుణ్య శిక్షణ కేంద్రాలని ఏర్పాటు చేయాలి. తెలంగాణ బిడ్డలకి ఉదారంగా రుణలని ప్రభుత్వం అందించినప్పుడే కొలువుల తెలంగాణ అవతరిస్తుంది.

# ఇంజినీరింగ్ ఎగుమతుల జోరు






కోల్‌కతా: జనవరి నెలలో ఇంజినీరింగ్ ఉత్పత్తుల ఎగుమతులు 7 శాతం పెరిగి 9.42 బిలియన్ డాలర్లుగా (రూ.82వేల కోట్లు) ఉన్నట్టు 'ఇంజినీరింగ్ ఎగుమతుల ప్రోత్సాహక మండలి' (ఈఈపీసీ) ప్రకటించింది. ముఖ్యంగా అమెరికాకు 18 శాతం అధికంగా 1.62 బిలియన్ డాలర్ల (రూ.14వేల కోట్లు) విలువైన ఇంజినీరింగ్ ఎగుమతులు జరిగినట్టు తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024 ఏప్రిల్ నుంచి 2025 జనవరి మధ్య కాలంలో మొత్తం ఇంజినీరింగ్ ఎగుమతులు క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చి చూస్తే 10 శాతం ఎగసి 97 బిలియన్ డాలర్లకు (రూ.8.43 లక్షల కోట్లు) చేరినట్టు ఈఈపీసీ వెల్లడించింది. ఈ కాలంలో యూఎస్‌కు ఇంజినీరింగ్ ఎగుమతులు 9 శాతం పెరిగి 15.60 బిలియన్ డాలర్లుగా (రూ.1.37 లక్షల కోట్లు) ఉన్నట్టు తెలిపింది. ముఖ్యంగా యూఏఈకి ఎగుమతుల్లో పటిష్ట వృద్ధి నమోదైంది. జనవరిలో 56 శాతం పెరిగి 610 మిలియన్ డాలర్లకు చేరగా.. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జనవరి మధ్యకాలంలో చూసినా 45 శాతం ఎగసి 6.87 బిలియన్ డాలర్లుగా ఉన్నట్టు ఈఈపీసీ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. జర్మనీ, మెక్సికో, టర్కీ, దక్షిణాఫ్రికా, ఫ్రాన్స్, జపాన్, నేపాల్, బంగ్లాదేశ్‌లకు జనవరి నెలలో ఇంజినీరింగ్ ఎగుమతులు పెరిగాయి. అదే సమయంలో యూకే, సౌదీ అరేబియా, మలేషియా, చైనా, ఇటలీ, స్పెయిన్‌లకు తగ్గాయి. జనవరి నెలకు దేశ మొత్తం వస్తు ఎగుమతుల్లో ఇంజినీరింగ్ ఉత్పత్తుల వాటా 25.86 శాతంగా ఉంది.

సవాళ్ల మధ్య రాణించిన ఎగుమతులు..

భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలకుతోడు వాణిజ్య రక్షణాత్మక ధోరణులు కొనసాగుతున్న తరుణంలోనూ దేశ ఇంజినీరింగ్ రంగం ఎగుమతుల పరంగా బలమైన వృద్ధిని చూపించినట్టు ఈఈపీసీ పేర్కొంది. అయితే, అంతర్జాతీయ వాణిజ్య విధానాల్లో వస్తున్న మార్పులు దేశ వ్యాపార సంస్థలపై అసాధారణ స్థాయిలో ఒత్తిళ్లను పెంచే ప్రమాదం లేకపోలేదని ఈఈపీసీ ఇండియా ఛైర్మన్ పంకజ్ చద్దా పేర్కొన్నారు. కార్మిక శాఖ పరిధిలో పనిచేసే ఈఈపీసీ ఇండియా.. ఎగుమతులను సులభతరం చేయడంతోపాటు, ఎంఎస్ఎంఈలు ప్రమాణాలను పెంచుకోవడానికి, అంతర్జాతీయ సరఫరా వ్యవస్థతో అనుసంధానం కావడానికి సేవలు అందిస్తుంటుంది. యూఎస్ తాజా టారిఫ్‌లు రానున్న రోజుల్లో ఎగుమతిదారులు ఎదుర్కోనున్న సవాళ్లను తెలియజేస్తున్నట్టు ఈఈపీసీ ఛైర్మన్ చద్దా పేర్కొన్నారు. ఎగుమతిదారులు పోటీతత్వాన్ని కొనసాగించేందుకు రుణ సాయం, టెక్నాలజీ పరంగా ప్రభుత్వం నుంచి మద్దతు కొనసాగాల్సి ఉందన్నారు.

# ఈ ఏడాదే భారత్‌లోకి చిన్న ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ



స్వీడిష్ లగ్జరీ కార్ల దిగ్గజం వోల్వో తమ చిన్న ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ ఈఎక్స్30ని ఈ ఏడాదే భారత మార్కెట్లో ప్రవేశపెట్టే యోచనలో ఉంది. దేశీయంగా ఏటా ఒక ఎలక్ట్రిక్ కారును ప్రవేశపెట్టాలనే వ్యూహానికి అనుగుణంగా దీన్ని తీసుకురానున్నట్లు సంస్థ ఎండీ జ్యోతి మల్హోత్రా తెలిపారు. మిగతా కార్లలాగానే ఈ వాహనాన్ని బెంగళూరు ప్లాంటులో అసెంబుల్ చేసి విక్రయించాలని భావిస్తున్నామని, ప్రస్తుతం సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. ఓ కొత్త సెగ్మెంట్ సృష్టించడం ద్వారా ఇది దేశీయంగా ఈవీల వినియోగం మరింతగా పెరిగేందుకు ఉపయోగపడగలదని మల్హోత్రా చెప్పారు. గతేడాది తాము భారత్‌లో విక్రయించిన ప్రతి నాలుగు కార్లలో ఒకటి ఎలక్ట్రిక్‌దని ఆయన వివరించారు. ఈ విభాగంలో ఎక్స్‌సీ40, సీ40 అని తమకు రెండే కార్లు ఉన్నప్పటికీ వీటి అమ్మకాలు తమ మొత్తం కార్ల విక్రయాల్లో దాదాపు పాతిక శాతానికి చేరినట్లు మల్హోత్రా చెప్పారు. ప్రస్తుతం మాస్ మార్కెట్ విభాగంలో ఎలక్ట్రిక్ కార్ల వినియోగం రెండు శాతంగానే ఉన్నప్పటికీ లగ్జరీ సెగ్మెంట్లో 6-7 శాతంగా ఉన్నట్లు వివరించారు. 2030 నాటికి అంతర్జాతీయంగా 90-100 శాతం ఆదాయాలను ఎలక్ట్రిక్ కార్ల నుంచే ఆర్జించాలనే లక్ష్యం దిశగా ముందుకు సాగుతున్నట్లు వివరించారు.కంపెనీ తెలిపిన వివరాల ప్రకారం..ఇది 427 హెచ్‌పీ సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. కేవలం 3.6 సెకన్లలో 0-100 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. %జుశ%30 రెండు బ్యాటరీ వేరియంట్లలో అందుబాటులో ఉంటుంది. 51 కిలోవాట్ల లిథియం-ఐరన్-ఫాస్ఫేట్ (ఎల్ఎఫ్‌పీ) బ్యాటరీ, 69 కిలోవాట్ల నికెల్-మాంగనీస్-కోబాల్ట్ (ఎన్ఎంసీ) బ్యాటరీలో వస్తుంది. గరిష్టంగా అధిక సామర్థ్యం ఉన్న బ్యాటరీ వేరియంట్ ఒకసారి ఛార్జ్ చేస్తే 474 కి.మీ వరకు ప్రయాణిస్తుంది.



# కార్మిక శక్తిలో 70 శాతం మహిళలే

## 2047 నాటికి వికసిత్ భారత్ సాధిస్తాం

### కేంద్ర కార్మిక శాఖ సెక్రటరీ సుమిత



ప్రకటించారు.

న్యూఢిల్లీ: 2047 నాటికి వికసిత్ భారత్ (అభివృద్ధి చెందిన దేశం) లక్ష్యాన్ని సాధించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర కార్మిక శాఖ కార్యదర్శి సుమితా ద ా ( ఎ ా అప్పటికి శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్యాన్ని 70 శాతానికి పెంచనున్నట్టు చెప్పారు. సేవల రంగంలో మహిళల ప్రాతినిధ్యంపై సీఐఐ నిర్వహించిన సదస్సులో భాగంగా ఆమె మాట్లాడారు.కొన్ని రంగాల్లో మహిళలు మరింత పెద్ద ఎత్తున పాలుపంచుకునేందుకు గొప్ప అవకాశాలున్నట్టు చెప్పారు. జాతీయ విద్యా విధానం కింద మహిళల విద్యార్హతల పెంపుపై దృష్టి సారించాల్సి ఉందన్నారు. మహిళల ఆధ్వర్యంలోని స్టార్టప్‌లు, సంస్థలకు వెంచర్ క్యాపిటల్ మద్దతుకు పిలుపునిచ్చారు. "మహిళా వ్యాపారవేత్తలకు వెంచర్ క్యాపిటల్ మద్దతు ఎంతో కీలకం. వారు నాయకులుగా మారేందుకు, నిర్ణయాలు తీసుకునేందుకు మార్గదర్శకం అవసరం"అని సుమిత ద్వారా పేర్కొన్నారు.

వివక్ష ..

శ్రామికశక్తిలో మరింత మంది మహిళలు భాగస్వాములు కాకుండా వివక్ష వారిని అడ్డుకుంటున్నట్టు సుమితా ద్వారా పేర్కొన్నారు. వేతనం, నాయకత్వ బాధ్యతల్లో, ఉద్యోగ భద్రతలో అసమానతలు ఉన్నట్టు చెప్పారు. అయితే గడిచిన ఆరేళ్లలో ఆర్థిక కార్యకలాపాల్లో మహిళల పాత్ర పెరిగినట్టు చెప్పారు. అలాగే, విద్యావంతులైన మహిళలు ఉద్యోగాల్లో చేరడంలో, స్థిరమైన ఆర్జనలోనూ పురోగతి ఉన్నట్టు వివరించారు. "టెక్నాలజీ, ఫైనాన్స్ రంగాలతోపాటు తయారీలోనూ మహిళలు రాణిస్తుండడాన్ని చూస్తున్నాం. మహిళలకు సంబంధించి వర్కర్ పాపులేషన్ రేషియో (డబ్ల్యూపీఆర్) గత ఆరేళ్లలో రెట్టింపైనట్టు డేటా తెలియజేస్తోంది"అని సుమితా ద్వారా చెప్పారు.

హిందుస్థాన్ జింక్‌లో 30 శాతం మహిళలే

2030 నాటికి తమ కంపెనీ ఉద్యోగుల్లో 30 శాతం మహిళలే ఉండాలన్న లక్ష్యాన్ని సాధించే క్రమంలో ఉన్నట్టు వేదాంత గ్రూప్ కంపెనీ హిందుస్థాన్ జింక్ (హెచ్‌జెడ్ఎల్) ప్రకటించింది. ప్రస్తుతం హిందుస్థాన్ జింక్ ఉద్యోగుల్లో మహిళలు 25% ఉన్నారు.




# సంపన్న భారతం!

## 2024లో 6 శాతం పెరిగిన మిలియనీర్లుబీ 85,698కి చేరిక

## 191 మంది బిలియనీర్లు

## నైట్ ఫ్రాంక్ 'వెల్త్ రిపోర్ట్ 2025'లో వెల్లడి



న్యూఢిల్లీ: సంపద సృష్టి దన్నుతో దేశీయంగా కుబేరుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది.2024లో 10 మిలియన్ డాలర్లకు పైగా సంపద ఉన్న వ్యక్తుల (హెచ్ఎన్‌డబ్ల్యూఐ) సంఖ్య 6 శాతం పెరిగి 85,698కి చేరింది. 2028 నాటికి ఇది 93,753కి చేరుతుందని అంచనా. ఇక అపర కుబేరుల్లాంటి బిలియనీర్ల సంఖ్య మరో 26 పెరిగి 191కి చేరింది. 2019లో బిలియనీర్ల సంఖ్య 7గా ఉండేది.

నైట్ ఫ్రాంక్ విడుదల చేసిన 'ది వెల్త్ రిపోర్ట్ 2025'లో ఈ అంశాలు వెల్లడయ్యాయి. హెచ్ఎన్‌డబ్ల్యూఐల జనాభా పెరుగు తుండటమనేది దీర్ఘకాలికంగా పటిష్టమైన ఆర్థిక వృద్ధి, పెట్టుబడులకు అవకాశాలు పెరుగు తుండటం, లగ్జరీ మార్కెట్ విస్త రిస్తుండటం తదితర అంశాలను సూచిస్తోందని నివేదిక పేర్కొంది. భారతీయ బిలియనీర్ల మొత్తం సంపద సుమారు 950 బిలియన్ డాలర్లుగా ఉంటుందని అంచనా. ఈ విషయంలో అమెరికా (5.7 ట్రిలియన్ డాలర్లు), చైనా (1.34 ట్రిలియన్ డాలర్లు) తర్వాత భారత్ మూడో స్థానంలో ఉంది. హెచ్ఎన్‌డబ్ల్యూఐల విషయంలో భారత్ నాలుగో స్థానంలో ఉంది. అమెరికా (9,05,413 మంది) అగ్రస్థానంలో, చైనా (4,71,634 మంది), జపాన్ (1,22,119 మంది) తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి. అంతర్జాతీయంగా చూస్తే 3.7 శాతం మంది హెచ్ఎన్‌డబ్ల్యూఐలు భారత్‌లో ఉన్నారు. 'ఎంట్రప్రెన్యూర్‌షిప్, కొత్త పరిశ్రమల దన్నుతో భారత్‌లో హెచ్ఎన్‌డబ్ల్యూఐల సంఖ్య అసాధారణంగా వృద్ధి చెందుతోంది. దీర్ఘకాలిక వృద్ధి అవకాశాలను, ఆర్థికంగా ఒడిదుడుకులను తట్టుకుని నిలబడగలిగే సామర్థ్యాలను దేశీయంగా పెరుగుతున్న సంపద సూచిస్తోంది' అని నైట్ ఫ్రాంక్ ఇండియా సీఎండీ శిశిర్ బైజల్ తెలిపారు.

### హ్యాండ్‌బ్యాగ్‌లపై మక్కువ ..

రియల్ ఎస్టేట్ నుంచి గ్లోబల్ ఈక్విటీల వరకు సంపన్నుల పెట్టుబడుల ధోరణులు కూడా మారుతున్నాయి. ఇందుకు సంబంధించిన నైట్ ఫ్రాంక్ లగ్జరీ ఇన్వెస్ట్‌మెంట్ ఇండెక్స్ (కేఎఫ్ఎల్ఐఐ) ప్రకారం గతేడాది అయిదు సాధనాలకు మాత్రమే డిమాండ్ నెలకొంది. అభిరుచులను బట్టి సంపన్నులు పెట్టుబడులు పెట్టే 10 సాధనాలను (లగ్జరీ కలెక్టబుల్స్) ఈ సూచీ మదింపు చేస్తుంది. దీని ప్రకారం లగ్జరీ హ్యాండ్ బ్యాగ్‌ల ధరలు 2.8 శాతం పెరగ్గా, ఆభరణాలు 2.3 శాతం, నాణేలు 2.1 శాతం, వాచీలు 1.7 శాతం, క్లాసిక్ కార్లు 1.2 శాతం పెరిగాయి. లగ్జరీ పెట్టుబడి సాధనంగా ఉండే ఆర్ట్ ధరలు అత్యధికంగా 18.3 శాతం పడిపోయాయి.

2023లో రెండంకెల స్థాయిలో వృద్ధి చెందిన ఈ విభాగంలో ధరలు, ప్రస్తుతం కోవిడ్-19 సంక్షోభ స్థాయి కన్నా దిగువకు తగ్గిపోయాయి. ఇక వైన్ రేట్లు 9.1 శాతం, ఫర్నిచర్ ధరలు 2.8 శాతం, రంగుల డైమండ్లు 2.2 శాతం తగ్గాయి. అరుదైన విస్కీ రేట్లు 9 శాతం క్షీణించాయి. 2022 వేసవి నాటి గరిష్ట స్థాయి నుంచి 19.3 శాతం పడిపోయాయి. లగ్జరీ కలెక్టబుల్స్ దీర్ఘకాలంలో ఇన్వెస్టర్లకు మెరుగైన రాబడులు అందించినట్లు నైట్ ఫ్రాంక్ గ్లోబల్ హెడ్ (రీసెర్చ్) లియామ్ బెయిలీ తెలిపారు. 'వీటిలో 2005లో 1 మిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టి ఉంటే, కేఎఫ్ఎల్ఐఐ ప్రకారం వాటి విలువ ప్రస్తుతం 5.4 మిలియన్ డాలర్లుగా ఉండేది. అదే మొత్తాన్ని ఎస్అండ్‌పీ 500లో ఇన్వెస్ట్ చేసి ఉంటే 5 మిలియన్ డాలర్లే అయ్యేది' అని పేర్కొన్నారు.


### దేశీయంగా

లగ్జరీ ఇళ్లలో ఢిల్లీ టాప్.. లగ్జరీ హౌసింగ్ సెగ్మెంట్‌లో ఢిల్లీ, బెంగళూరులో రేట్లు గణనీయంగా పెరిగాయి. ఇందుకు సంబంధించిన ప్రైమ్ ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ ఇండెక్స్ (పీఐఆర్ఐ) 2023తో పోలిస్తే 2024లో 3.6 శాతం పెరిగింది. దీని ప్రకారం విలాసవంతమైన నివాస గృహాల ధరలు 6.7 శాతం పెరగడంతో అంతర్జాతీయంగా టాప్ 100 నగరాల్లో ఢిల్లీ 37వ స్థానం నుంచి 18వ స్థానానికి ఎగబాకింది. బెంగళూరు 59వ ర్యాంకు నుంచి 40వ ర్యాంకుకు పెరగ్గా, ముంబై మాత్రం 13 ర్యాంకులు తగ్గి 21 స్థానానికి పడిపోయింది. అంతర్జాతీయ స్థాయిలో 18.4 శాతం రేట్ల వృద్ధితో సియోల్ అగ్రస్థానంలోనూ, మనీలా (17.9 శాతం), దుబాయ్ (16.9 శాతం) వరుసగా రెండు, మూడు స్థానాల్లోనూ ఉన్నాయి. మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆర్థిక వృద్ధి, లగ్జరీ ప్రాపర్టీలకు డిమాండ్ దన్నుతో హై-ఎండ్ రియల్ ఎస్టేట్ విభాగంలో ఈ నగరాలు ఆకర్షణీయంగా మారడాన్ని తాజా ర్యాంకులు సూచిస్తున్నట్లు బైజల్ తెలిపారు.



# మైక్రోసాఫ్ట్ డౌన్..

## ఇమెయిల్, యాప్ లు వాడే వాళ్లకు తీవ్ర ఇబ్బందులు



: మైక్రోసాఫ్ట్ మరోసారి డౌన్ అయింది. దీని కారణంగా పెద్ద సంఖ్యలో వినియోగదారులు తీవ్రసమస్యలను ఎదుర్కొంటున్నారు. దాదాపు ఏడు నెలల క్రితం గతేడాది జూలైలో మైక్రోసాఫ్ట్ అంతరాయం ప్రపంచవ్యాప్తంగా ఉన్న బ్యాంకులపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. ఈసారి కంపెనీ మైక్రోసాఫ్ట్ ఔట్‌లుక్, మైక్రోసాఫ్ట్ 365, ఇతర సర్వీసులలో అంతరాయం సమస్య వేలాది మంది వినియోగదారులను ఇబ్బందులకు గురిచేసింది. మైక్రోసాఫ్ట్ పని చేయక పోవడంతో వినియోగదారులు ఇమెయిల్ అకౌంట్లలోకి లాగిన్ అవ్వడంలో.. మైక్రోసాఫ్ట్ యాప్‌లను ప్రాసెస్ చేయడంలో సమస్యలను ఎదుర్కొంటున్నారు. 37,000 కంటే ఎక్కువ మంది వినియోగదారులు మైక్రోసాఫ్ట్ అవుట్ లుక్ ను ఉపయో గించలేకపోతున్నామని సోషల్ మీడియా వేదికగా ఫిర్యాదులు చేశారు. అయితే 24 000 మంది వినియోగదారులు మైక్రోసాఫ్ట్ 365 సర్వీసును ఉపయోగిం చలేక పోతున్నామని ఫిర్యాదులు చేశారు. ఇది మాత్రమే కాదు, కొంతమంది మైక్రోసాఫ్ట్ టీమ్స్ ను యాక్సెస్ చేయడంలో కూడా సమ స్యలను ఎదుర్కొన్నారు. ఈ అంతరాయం కారణంగా, చికాగో, న్యూయార్క్, లాస్ ఏంజిల్స్‌లలో నివసించే వినియోగదారులు తీవ్ర సమస్యలను ఎదుర్కోవలసి వచ్చింది. అంతరాయం తర్వాత వినియోగదారులు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ %శ%లో కంపెనీకి ఫిర్యాదు చేయడం మొదలు పెట్టారు. వినియోగదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులకు కంపెనీ స్పందించింది. ఈ అంత రాయం సమస్య త్వరలో పరిష్క రించబడుతుందని వినియోగదారులకు హామీ ఇచ్చింది. వినియోగదారుల ఫిర్యా దులు పేరుకుపోవడంతో.. ఆ కంపెనీ అంతరాయానికి కారణాన్ని గుర్తించామని పేర్కొ ంటూ మరొక పోస్ట్ చేసింది. సమ స్యకు కారణమైన కోడ్‌ను తీసివేశామని.. తమ టెక్నికల్ టీం ఇప్పుడు రికవరీ ప్రక్రియను పర్యవేక్షిస్తోందని తెలిపింది. చాలా సేవలు తిరిగి ప్రారంభం అయ్యాయని కంపెనీ ధృవీకరించింది.

### జూలై 2024లో ఏం జరిగింది?

గతేడాది జూలైలో మైక్రోసాఫ్ట్ సాఫ్ట్‌వేర్‌లో సమస్య కారణంగా ప్రపంచ వ్యవస్థ నిలిచిపోయింది. దీని కారణంగా భారతదేశంలోనే కాకుండా వివిధ దేశాలలో కూడా కంపెనీల సేవలకు అంతరాయం ఏర్పడింది. ఈ కారణంగా విని యోగ దారు లు తీవ్ర సమస్యలను ఎదుర్కోవలసి వచ్చి ంది. కంపెనీలు విమా నాలను రద్దు చేయా ల్సి వచ్చింది. దీంతో విమా నయాన రంగానికి తీవ్ర నష్టం వాటిల్లింది. ఇది మాత్ర మే కాదు, లండన్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సర్వర్ కూడా పనిచేయడం ఆగి పోయింది. ఐటి రంగం కూడా కుప్పకూలింది.

EDITOR, PRINTER, PUBLISHER AND OWNED BY SIRASALA SURESH KUMAR, Printed at M/S MARPU PUBLICATION,# /639-1-7-15, NANDYAL ROAD, CPI COLONY, 4TH ROAD, TADIPATRI-515 411, Ananthapuramu Dist., (A.P.), PUBLISHED AT # 1/639-1-7-15, NANDYAL ROAD,CPI COLONY, 4TH ROAD,TADIPATRI-515 411,Ananthapuramu Dist.,(A.P.). Cell:9398156948,REG.RNI: APTEL/2023/86845, E-Mail:janamnews19@gmail.com